# ది క్రైమ్ న్యూస్
Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, మార్చి 26, 2025 | సంపుటి - 20 | సంచిక 174 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

### కేటీఆర్‌ను హెచ్చరించిన రాజాసింగ్



హైదరాబాద్ : ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు చెప్పిన విధంగానే పోలీసులు వింటారని, పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని అన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. 2

# క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

**మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు**



## మంత్రిపదవిఎవరిని వరిస్తుందోనని చర్చలు

**ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహుర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.**

హైదరాబాద్ : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలం గాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపే తంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా మిగతా 2లో

## ఫైనాన్స్ బిల్లుకు లోక్ సభ పచ్చజెండా



### మొత్తం 35 సవరణలకు అనుమతి

**ఆన్ లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం పక్రియ లోక్‌సభలో పూర్తయింది.ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది.**

న్యూఢిల్లీ : రాజ్యసభ కూడా ఫైనాన్స్ బిల్లును ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం పక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు- కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వాటా, గ్రాంట్లు, రుణాలు 2లో

## ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

**ఏడాదయినా కార్యరూపం దాల్చని పథకం**



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది కింద ప్రకటించారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని కెసిఆర్, రేవంత ప్రకటించినా ఇద్దరూ మాటతప్పారు. 2

## ఘటకేశ్వర్ రైల్వే బ్రిడ్జికి తొలగిన అడ్డంకులు

**50లక్షలు మంజూరు చేసిన భట్టి**



హైదరాబాద్ : మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చొరవతో ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనులకు నిధులు మంజూరయ్యాయి. అర్థాంతరంగా పనులు నిలిచిపోయి పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనుల నిమిత్తం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.50 లక్షలను మంజూరు చేశారు. 2

## మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్

**తప్పుడు లెక్కలపై నిలదీత**



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర అన్నీ తప్పుడు లెక్కలే ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలపై అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్‌ఎస్ హయాంలో 26 వేల 2లో

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐటి బిల్లు



కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలకు నిర్మలా సీతారామన్ సమాధానంఇస్తూ, ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని తెలియజేశారు.

**సెలెక్ట్ కమిటీ ముందుకు నివేదిక**

**ప్రసాదాలపై జిఎస్టీ ఎత్తివేత**


**ఆర్థికమంత్రి నిర్మలాసీతారమన్ వెల్లడి**

న్యూఢిల్లీ : సెలెక్ట్ కమిటీ- తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటి రోజు సమర్పించవలసి ఉంది. 'మేము దానిని వర్షాకాల సమావేశాల్లో చేపడతామని మంత్రి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో మొదలై ఆగస్టు వరకు సాగుతుంటాయి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఆమోదం పొందిన తరువాత డిజిటల్ రికార్డును కూడా మదింపునకు పరిగణన లోకి తీసుకోనున్నట్లు- సీతారామన్ చెప్పారు. 1961 చట్టంలో డిజిటల్ ప్రస్తావన లేనందున అది తరచు వివాదాస్పదం అవుతోందని, జనం కోర్టును ఆశ్రయించి, పాస్‌కోడ్‌ను పంచుకోకుండా రక్షణ కోరుతున్నారని ఆమె తెలిపాను. 'అందువల్ల డిజిటల్ ఒక వివాదంగా మారుతోంది. ఇప్పుడు ఉన్న 2లో

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

**గత తీర్పులను ఎలా కాదనగలమన్న ధర్మాసనం**

**విచారణ ఏప్రిల్ 2కు వాయిదా**



న్యూఢిల్లీ : తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు చర్య తీసుకునేందుకు 2

## తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం

**ఒకవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు**



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం కొనసాగుతోంది.. ఓ వైపు ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మరో వైపు అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి.. ఓ వైపు ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు.. రెండు మూడు రోజుల నుంచి తగ్గిన ఉష్ణోగ్రతలతో 2లో

# ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ

### మేలో తల్లికి వందనం అమలు

**కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనిచేయాలి**

**2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం**

**రాజధాని అమరావతి ప్రాజెక్టును 2027లోగా పూర్తి**

**ప్రజా సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యం కావాలి**

**విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలి**

**కెలక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు ఇర్దేశం**

**ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు- ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.**

అమరావతి : సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ.. కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణా అధికారులు అంటూ.. ఏసీ రూమ్‌లకు కలెక్టర్లు పరిమితం కావద్దన్నారు.. సమస్యల పరిష్కారంలో కలెక్టర్లది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యమని వెల్లడించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలన్నారు. రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన 2లో



## జమిలి ఎన్నికలకు జెపిసి గడువు పొడిగింపు



**లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం**

న్యూఢిల్లీ : 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీ కాలాన్ని 2025 వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు పొడిగించే ప్రతిపాదనను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు 2024 , కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు- 2024 పై లోక్‌సభలో నివేదిక సమర్పించడానికి సమయాన్ని పొడిగించాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పిపి చౌదరి మంగళవారం ప్రతిపాదించారు. దీనిని సభ మూజువాణి ఓటు- ద్వారా ఆమోదించింది. దేశ వ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను

# పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పిన విధంగా పోలీసులు లీగల్‌గానే పనిచేస్తారని... ఆ విషయం మర్చిపోయారా కేటీఆర్ అని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి పోలీసులు జైలుకు పంపిస్తున్నారని... బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్‌కు చూశారన్నారు. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు కూడా పంపించారని రాజా సింగ్ గుర్తుచేశారు. అయితే ఇందులో షాకింగ్ విషయం ఏంటంటే.. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించే సమయంలో సొంత పార్టీ నేతలు, కొంతమంది బీజేపీ అధికారులు.. పోలీసులకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని ఓ పోలీస్ అధికారే స్వయంగా తనతో చెప్పారన్నారు. అయితే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. తనను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, బీజేపీ అధికారులను ఏం చేయాలని ప్రశ్నించారు.

# ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

గతేదాది జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. ఆధార్ నెంబర్ తరహాలో ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చికిత్స అందించేందుకు వీలుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ప్రత్యేక నంబర్‌తో అనుసంధానం చేయనున్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుపై ఉన్న నెంబర్ గానీ.. పేరు గానీ ఎంటర్ చేయగానే.. ఆ వ్యక్తికి సంబంధించిన వైద్య సేవల వివరాలు తెలుస్తాయనా అన్నారు. దీని వల్ల వారు ఏ వైద్యుడిని సంప్రదించినా.. వారివారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకునే వీలు ఉంటుందని.. మెరుగైన వైద్యసేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కానీ ఏడాది గడిచింది. దీనిపై అడుగు ముందుకు పడలేదు. కనీసం చర్చ లేదు. ఎక్కడా కార్యాచరణ కానరావడం లేదు.

# జమిలి ఎన్నికలకు జెపిసి గడువు పొడిగింపు

నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై మోదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బీజేపీ ఎంపీ, మాజీ న్యాయశాఖ మంత్రి పిపి చౌదరి అధ్యక్షతన 39 మంది సభ్యుల జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు– చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం అంగీకరించడం లేదు. తాజాగా జెపిసి చైర్మన్, భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపి పిపి చౌదరి గడువు పెంపు కోసం తీర్మానాన్ని లోక్‌సభలో ప్రతిపాదించారు. సభ మూజువాణి ఓటుతో తీర్మానాన్ని ఆమోదం తెలిపింది. రాజ్యసభ నుంచి ఒక కొత్త సభ్యుని కమిటీ–లో చేరుస్తున్నట్లు– లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలియజేశారు. రాజ్యసభ నుంచి వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి రాజీనామాతో 39 మంది సభ్యుల కమిటీలో ఒక ఖాళీ ఏర్పడింది.జమిలి ఎన్నికలపై జెపిసిని గత శీతాకాల సమావేశాల్లో ఏర్పాటు– చేశారు. కమిటీ– కాలపరిమితి ప్రస్తుత సమావేశాల చివరి వారం మొదటి రోజున ముగియవలసి ఉన్నది. కాగా, రానున్న వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు కమిటీ గడువును సభ పొడిగించింది. 39 మంది ఎంపిలతోఏర్పాటు– చేసిన జెపిసి ఈ బిల్లును అధ్యయనం చేస్తోంది. కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. వాస్తవానికి కమిటీ– కాలపరిమితి ఏప్రిల్ 4న ముగియనున్నది. బిల్లుపై చేయవలసిన పని ఇంకా మిగిలి ఉందని అధికార వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో జెపిసి గడువు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలియజేసింది.

# ఘటకేశ్వర్ రైల్వే బ్రిడ్జికి తొలగిన అడ్డంకులు

దీనిపట్ల ఘటకేసర్ జేఏసీ, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని ఘటకేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ మంత్రి మల్లారెడ్డికి కలిసి వినతిపత్రం అందజేశారు.దీంతో డిప్యూటీ– సీఎం భట్టివిక్రమార్కను మల్లారెడ్డి కలిసి సమస్యను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క, రూ.50 లక్షలను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు చేయడం పట్ల భట్టి విక్రమార్క, మల్లారెడ్డికి ఘటకేసర్ జేఏసీ చైర్మన్ మారం లక్ష్మారెడ్డి, సభ్యులు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి మల్లారెడ్డి చొరవతోనే బ్రిడ్జి నిర్మాణం 80 శాతం పూర్తయిందని తెలిపారు. తన సొంత నిధులను కూడా బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించడం ఆయన గొప్పతనానికి నిదర్శనం కొనియాడారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేంతవరకు సహకారం అందిస్తారని జేఏసీ, బీఆర్ఎస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పిఎం కిసాన్ సమ్మాన్‌లో అనర్హుల ఏరివేత ప్రక్రియ

**ఇప్పటికే రూ.416 కోట్లు రికవరీ చేశాం**

**లోక్‌సభకు వెల్లడించిన మంత్రి చౌహాన్**

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అనర్హుల ఏరివేతను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు అనర్హులు. వారు దీనికింద లబ్ధిపొందితే వారి నుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. ఈ పథకం ద్వారా లబ్ధిపొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగు తుందని, పీఎం–కిసాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా రిజిస్టర్ చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. దీనిని రైతులకు ఉపయుక్తంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ చేసినట్లు–శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 విడతల్లో రూ.3.68లక్షల కోట్లు– రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ పథకం ప్రారంభంలో స్వీయ ధ్రువీకరణ ఆధారంగా లబ్ధిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేయగా.. ఆధార్, ఆదాయపన్ను శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖల వద్ద ఉన్న సమాచారంతో అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

# క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్చు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశావహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్లు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడీకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ వినిపించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. ఆల్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిక్సే తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుందొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటీషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశావహులు ఉన్నారు. మరి నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ లో కేబినెట్ బెర్త్ దేజిక్కించుకునే ఆ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటీషన్ నేపథ్యంలో రాజుపుత్రులు–అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.

# ఏప్రిల్‌లో మెగా డిఎస్సీ

తమ విధానమని తెలిపారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని.. క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలని అన్నారు. అప్పులు తెస్తే ఎంతకాలం కొనసాగిస్తామని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదని.. అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తీర్పు ఇస్తారన్నారు. 9 నెలల్లో అనేక హామీలు అమలు చేస్తూ వస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా రూ.4 వేలు పింఛన్ లేదు.. మనం ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచామని చెప్పుకొచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్లతో రూ.5కే భోజనం అందిస్తున్నామని.. దీపం–2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. చెత్త పన్నును తొలగించామని తెలిపారు. 2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు. విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు.. పెన్షన్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది అన్నారు.. సోలార్ పవర్‌లో భాగంగా 20 లక్షల మందికి సోలార్ పవర్ ఇవ్వడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ ను ప్లాన్ చేసే పనిలో కలెక్టర్లు ఉండాలని స్పష్టం చేశారు.. ప్రజల్లో అత్యంత ప్రభావం కలిగించే వ్యక్తి కలెక్టర్.. కెరీర్‌లో కలెక్టర్.. చీఫ్ సెక్రటరీకి ఇవే ముఖ్యం అన్నారు.. ఇక, రొటీన్‌గా ఉంటే ఏదీ అవ్వదంది.. మాకే నాలుగేళ్లు కూడా గడిచిపోతాయి అన్నారు. ఈ ప్రభుత్వం.. సంక్షేమం.. అభివృద్ధి.. సుపరిపాలన.. ఈ మూడు గుర్తుండాలి.. ప్రజలు ఆనందంగా ఉండాలంటే సంక్షేమం కావాలి.. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా ఉంది.. కేవలం పెన్షన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్లు అవుతోందని వెల్లడించారు. అమరావతి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్.. ప్రజల్ని ప్రోగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలన్నారు.. 20 లక్షల మందికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు– చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో కలెక్టర్లు.. సోలార్ రూఫ్ టాప్ పై దృష్టి పెట్టాలన్నారు.. ప్రీ మాన్‌సూన్ పోస్ట్ మాన్‌సూన్ పై దృష్టి సారించాలి.. ప్రతి జిల్లా కలెక్టర్ అరకు కాఫీ పై ఫోకస్ చేయాలన్నారు.. మరోవైపు, మే నెలలో తల్లికి వందనం ఇస్తాం.. త్వరలో ఏడు విధానాలు వస్తాయని తెలిపారు. 26 జిల్లాల కలెక్టర్ల పెర్ఫార్మెన్స్ పై సమీక్ష జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047.. విజన్ భారత్ పై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి పెట్టారు.. అందుకు అనుగుణంగా.. 175 నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్‌లు ఉంటాయన్నారు.. ఎమ్మెల్యే ఆ నియోజకవర్గానికి చైర్మన్ గా ఉంటారని తెలిపారు సీఎం చంద్రబాబు.. గత పాలనతో విసిగి మాకు విస్తృత మద్దతు ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించే పక్రియ చేపట్టాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందాలని అన్నారు. మే నెలలో తల్లికి వందనం ప్రారంభిస్తాం. రూ.15 వేల చొప్పున.. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తాం. పాఠశాలలు తెరిచేలోగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తాం. ఆయామయంలో పడిపని పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టాం. రాజధాని అమరావతి ప్రాజెక్టును 2027లోగా పూర్తి చేస్తాం. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి సంస్థల నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటున్నాం. ల్యాండ్ మానిటైజేషన్ ద్వారా ఈ అప్పులు తీర్చేస్తామని అన్నారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకూ ప్రణాళికలు చేరాల్సిందే. జీఎస్‌డీపీ, జీవీఏలతో పాటు– తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెంచాలి. వచ్చే ఏడాదికి 15 శాతం గ్రోత్ జీఎస్‌డీపీ సాధించేలా కలెక్టర్లు కృషి చేయాలి. వ్యవసాయం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు, సిఎస్, ఇతర ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐటి బిల్లు

ఆ లోటును కొత్త ఆదాయపు పన్ను బిల్లులో భర్తీ చేస్తున్నాం. బిల్లు సెలెక్ట్ కమిటీ– ముందు ఉందని ఆమె చెప్పారు. తనిఖీ, స్వాధీనం కేసుల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడి ఖాతాలు సహా వర్చువల్ డిజిటల్ స్పేస్, కంప్యూటర్ సిస్టమ్‌ల అందుబాటు– కోడ్‌ను అధిగమించే అధికారాలను పన్ను అధికారులకు కొత్త బిల్లు దత్తం చేస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం పరిమాణంలో సగం ఉన్న సరళీకృత ఆదాయపు పన్ను బిల్లు దావా అవకాశాన్ని, కొత్త అన్యాయాన్ని కనిష్ఠ స్థాయికి చేర్చడం ద్వారా పన్నును సక్రమంగా చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ అంతకు ముందు తెలియజేసింది. తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలాసీతారామన్ వివరించారు. వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్ను ను కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిస్థితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఒకటి. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

తగిన సమయం అని చెప్పలేదని.. అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది. ఉన్నత



ధర్మాసనం తీర్పులను తిరిగి ఎలా సమీక్షగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఆరియామా వాదనలు వినిపిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేపై వేరు వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని.. నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరఫున లోకసభ ఎన్నికల్లో పోటీ– చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో... నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని.. అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీ–సు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రి–ఞలపై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని.. ఆ మూడు వారాలు, నోటీ–సుల విషయంలో ఎపి–వెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని.. ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో జాప్యం జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు వాదించారు. సుప్రీంకోర్టులోనే ఈ అంశం తేలిపోతుందని భావిస్తుండగా.. విచారణకు తేదీ వాయిదా పడింది. జస్టిస్ గవాయ్ ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నవ్వుతూ చెప్పారు. స్పీకర్ కార్యాలయం అధికారాలతో ఉన్నారని.. రాజ్యాంగ పరిరక్షకులు కట్టు–బడి ఉండాలని.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అందుకే సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాసీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లలేని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని... కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్నారు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌కు తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాది సుందరం మాట్లాడుతూ.. తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుంది... కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు– పడిందని ఆర్యామ సుందరం వెల్లడించారు. మరో కేసులో... తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటు–ందనిని చెప్పిందని చెబుతూ.. పాడి కౌశిక్ రెడ్డి తరపున న్యాయవాది ఆరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు– సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ తరపు వాదనలు ముగియగా.. తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

# తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం

కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అలాగే.. కొన్ని ప్రాంతాల్లో ద్రోణి ప్రభావంతో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.. తెలంగాణలో 2–3 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశ ముందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుండి మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక మీదుగా ఉత్తర కేరళ వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుంది.. ఆ తరువాత క్రమేపి రెండు నుండి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ రోజు గరిష్ఠంగా ఆదిలాబాద్ లో 38.3 కనిష్ఠంగా హైదరాబాద్ లో 33.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం, మహబూబ్ నగర్ లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఆదిలాబాద్..38.8, నిజామాబాద్..37.8, భద్రాచలం..37.2, ఖమ్మం..37.2, మహబూబ్ నగర్..35.6, నల్లగొండ.. 35.5, రామగుండం..35, మెదక్..34.6, హనుమకొండ..34.5, హైదరాబాద్..33.6 డిగ్రీల పగలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. ఏపీలో రాలిశ్రేస్తున్న ఎండలు.. మంగళవారం ఏపీలోని 52 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. నేడు శ్రీకాకుళం జిల్లా –8, విజయనగరం జిల్లా–10, పార్వతీపురంమన్యం జిల్లా–12, అల్లూరి సీతారామరాజు జిల్లా–6, కాకినాడ–5, తూర్పుగోదావరి–6, ఏలూరు–2, ఎన్టీఆర్ జిల్లా 3 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉంది. సోమవారం అనంతపురం జిల్లా నాగసముద్రంలో 39.9%%, వైఎస్సార్ జిల్లా అట్లూరు 39.8, చిత్తూరు జిల్లా నిండ్ర 39.7%%, నంద్యాల జిల్లా దొర్నిపాడు 39.6%%, ప్రకాశం జిల్లా గుంటుపల్లి 39.2 అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. అలాగే మూడు మండలాల్లో వడగాల్పులు వీచాయి. వేసవి అకాల వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమరావతి వాతావరణ కేంద్రం సూచించింది.

# ఫైనాన్స్ బిల్లుకు లోక్ సభ పచ్చజెండా

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు–. అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు– 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు– 4.8 శాతంగా అంచనావేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) రూ. 3,56,97,923 కోట్లు–గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జీడీపీ రూ. 3,24,11,406 కోట్లు–. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

# మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్


ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## కొత్త మద్యం పాలసీనూ వాడీవేడీ చర్చ

హైదరాబాద్ : కొత్త మద్యం పాలసీ, బెల్టు షాపుల నిర్వహణపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు–చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు లిక్కర్ రేట్లు అడ్డగోలుగా పెంచుతోందని, కొత్త మద్యం పాలసీని వెంటనే విత్ డ్రా చేసుకోవాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం.. కొత్త బ్రాండ్లు.. కొత్త బీర్లు, కొత్త బార్లు, కొత్త పబ్‌లు ఇదేనా ప్రభుత్వ పాలసీ అని ప్రశ్నించారు. ?రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులు తీసేయాలని డిమాండ్ చేశారు. ఆదాయ మార్గాన్ని పెంచేందుకు బెల్టు షాపులను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనికి శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలోనే అడ్డగోలుగా.. ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు జరిపారని ఫైర్ అయ్యారు. ఆఖరికి రేషన్‌షాప్‌ల్లో కూడా లిక్కర్ సేల్స్‌కు పర్మిషన్ ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. బెల్టుషాపులపై వారు తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు– ఉందని సెటైర్ వేశారు. బెల్టు షాపులు తామే తెచ్చామని ప్రశాంత్ రెడ్డి ఒప్పుకోవడం సంతోషకరం. బెల్టు షాపులు మేం పెంచలేదు. అలాంటివి మేం ఎంకరేజ్ చెయ్యబోం. ప్రభుత్వంలో లీకేజీస్ ఉండొద్దు అనే ఆలోచనతో ఆదాయం పెంచుతామన్నం. బీఆర్ఎస్ హయాంలో అడ్డగోలుగా ఇష్టారాజ్యంగా చౌక షాపుల్లో మద్యం అమ్మకాలు జరిగాయి. ఎ–క్సై–+–సజ్ శాఖలో లీకేజెస్ లేకుండా సర్కార్ చేపడుతుంది. అడ్మినిస్ట్రేషన్ లో రీఫామ్ ఇస్తాం. దీని వల్ల రెవెన్యూ పెంచుకుంటాం' అని శ్రీధర్ బాబు తెలిపారు.

# గత ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ కుప్పకూలింది

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్): హైదరాబాద్ అసెంబ్లీలో మంగళవారం నిర్వహించిన శాసన సభ సమావేశాల్లో విద్యా వ్యవస్థపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ..... కూలిపోయిన విద్యావ్యవస్థను పునర్నిర్మించడానికి అవసరమైన సంస్కరణలను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రగతిశీల సమాజానికి పునాదిగా ప్రపంచాన్ని మార్చడానికి అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని చెప్పిన నెల్సన్ మండేలా మాటను ఎమ్మెల్యే ఉటంకించారు. గత దశాబ్దంలో తెలంగాణలో విద్యా వ్యవస్థ అపారమైన నష్టాన్ని చవిచూసిందన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు విద్యకు ప్రాధాన్యత ఇస్తుందనే ఆశ పడ్డామని దురదృష్టవశాత్తు, బీఆర్ఎస్ పాలనలో అది జరగలేదన్నారు. గత ప్రభుత్వ బడ్జెట్లో భారీగా కోతలు విధించిందగా సుమారు 16,000 కోట్ల నుండి తరువాతి సంవత్సరాల్లో విద్యా బడ్జెట్ గణనీయంగా తగ్గిందని, దీని ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాల కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. ఫలితంగా 1000 కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడ్డాయన్నారు. 3వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ జాప్యం కారణంగా దాదాపు 5లక్షల మంది పేద విద్యార్థులు చదువును మానేయాల్సి వచ్చిందని, 5వేల మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, సమస్య మూలాలను పరిష్కరించడం కంటే ఉపాధ్యాయుల డిమాండ్లను అణచివేయడం పై ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెట్టిందని నిందించారు. ఇలాంటి పరిస్థితుల్లో గాడిలో పెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో 6% మించి విద్యా నిధులను పెంచడమేట్ కాకుండా సంవత్సరానికి కనీసం 18వేల కోట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను ఆలస్యం లేకుండా భర్తీ చేయాలని ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న 3వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ తోపాటు విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల పోషకాహారాన్ని పెంచడానికి కనీసం 30 లక్షల మంది విద్యార్థులకు నాణ్యతగల భోజనం అందించేలా మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపర్చాలని గత దశాబ్దంలో చూసినట్లుగా, విద్యను ఖరీదైనదిగా కాకుండా సరసమైనదిగా చేయడానికి ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాల్సిన అవసరం ఉందని ఉద్యోగవర్గాల డిమాండ్లకు అనుగుణంగా వృత్తి నైపుణ్య ఆధారిత విద్యను ప్రోత్సహించాలన్నారు. ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్ట్ పై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన ప్రశంసలు కురిపించారు. గత వైఫల్యాలను మనం తీవ్రంగా విమర్శిస్తున్నప్పటికీ, ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్ట్ ను అమలు చేయాలనే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని మనం అభినందించాలన్నారు. ఈ చొరవ ప్రభుత్వ విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకురావడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. 2వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ అభ్యాస సౌకర్యాలను అందించడం జరుగుతుం దన్నారు. తెలంగాణ విద్యా వ్యవస్థను ప్రపంచ ఉత్తమ పద్ధతులతో సమలేఖనం చేయడం స్టెమ్-ఆధారిత విద్యను పెంచడం పేద వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి విద్యను పొందేలా చూసుకోవడం దాదాపు 10 లక్షల మంది విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చడం సాధ్యపడుతుం దన్నారు. ఈ ప్రాజెక్ట్ కాగితంపైనే ఉండకండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో సమానంగా పోటీ పడగలిగేలా దీన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలని డాక్టరు కవ్వంపల్లి ప్రభుత్వాన్ని కోరారు.

# బైండవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేలు జరిమానా



తొర్రూరు, ది క్రైమ్ న్యూస్ : గుడుంబా దాడులలో పట్టుబడిన వ్యక్తులను తహసిల్దార్ ముందు బైండ్ ఓవర్ చేయగా వారు బైండోవర్ జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇంచార్జ్ రాజేశుని ప్రవీణ్ తెలిపారు.సీఐ తెలిపిన వివరాల మేరకు....సారా విక్రయిస్తూ పట్టుబడిన కేసులో పట్టుబడి బైండోవర్ ఉల్లంఘించిన వ్యవహారంలో తొర్రూరుకు బొమ్మన బోయిన వెంకన్న ను ఖమ్మం జైలు కు తరలించినట్లు తెలిపారు. తొర్రూరు దుబ్బతండ కు చెందిన ధరావత్ యాకూబ్, పెద్ద వంగర మండలం వంపు తండకు చెందిన ధరావత్ శ్రీను అను వ్యక్తులు బైండ్ ఓవర్ ను ఉల్లంఘించినందుకు రూ.90 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..గుడుంబా ను పూర్తిగా నిర్మూలించేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేయడం జరిగిందని, టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్మెంట్ విభాగాలు గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో దాడులు కొనసాగిస్తుందని తెలిపారు. యువత మత్తుపదార్థాల జోలికి పోవద్దని సూచించారు. గుడుంబా, గంజాయితో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని అన్నారు. గుడుంబా, ఇతర మత్తుపదార్థాల విక్రయించే వారిపై చట్టపరమైన వ్యసనాలు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై ఎం. రవళి రెడ్డి, ఎన్. శంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్యం ఆదాయం ఎలా పెంచారో తెలుసు

### వేముల ప్రశ్నలకు మంత్రి జూపల్లి సమాధానం

హైదరాబాద్ : బెల్టు షాపులు పెంచిన ఘనత బిఆర్ఎస్ దేనని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళంవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులపై మంత్రి జూపల్లి మండిపడ్డారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అడిగిన మద్యం అమ్మకాలపై ప్రశ్నకు జూపల్లి సమాధానం ఇస్తూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ. 9,000 కోట్లు ఉన్న మద్యం ఆదాయాన్ని 2023 వరకు రూ. 34,000 కోట్లకు ఎలా పెంచిందో అందరికీ తెలుసన్నారు. చట్టవిరుద్ధంగా బెల్ట్ షాపులను పెంచి వాటి ద్వారా అక్రమంగా మద్యం అమ్మించారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం స్మగ్లింగ్ ఆపడానికి దాడులు చేస్తోందని, ఫామ్ హౌస్‌లలో మద్యం తాగడాన్ని నిషేధించిందని సమాధానమిచ్చారు. ప్రశాంత్ రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానం ఇస్తూ ఆర్‌ఆర్‌ఆర్ పనుల కోసం భూసేకరణ పనులకు అనుమతి వచ్చిందని, నిధుల విడుదలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని త్వరలోనే కలుస్తున్నామని చెప్పారు. విపక్ష నేతల నియోజకవర్గాల్లో రోడ్ల మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేయడం లేదనేది అబద్ధం అని, హరీష్ రావు, కేటీ-ఆర్ నియోజకవర్గాల్లో రోడ్ల మరమ్మత్తుల కోసం, నూతన రోడ్లకు సరిపడా నిధులు కేటాయిస్తున్నామని వెంకటరెడ్డి సమాధానమిచ్చారు.

# చారానకోడికి- బారాన మసాలా

### ఊరూరా వెలసిన ఫ్లెక్సీలు. ఖరీదైన ప్రచారం
### ఒక్కొక్క ఫ్లెక్సీకి 350
### కోట్ల ప్రజాధనం తో ప్రచారం



ద క్రైమ్ న్యూస్ బ్యూరో పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో ఏ మారుమూల గ్రామాల్లో చూసినా కూడా ఫ్లెక్సీల రెపరెపలు కనిపిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో రుణమాఫీ పొందిన రైతుల వివరాలను తెలియజేస్తూ ప్రభుత్వం కోట్ల ప్రజాధనంతో చేస్తున్న ప్రచారం ఇది. కుటుంబ ప్రాతిపదికన రెండు లక్షల లోపు రుణమాఫీ జరిగిన రైతులందరి పేర్లను ఇలా ఫ్లెక్సీల ద్వారా ప్రధాన కూడళ్ళ లో మరియు గ్రామ పంచాయితీ కార్యాలయాలల్లో ఇలా ప్రదర్శిస్తున్నారు. నిజానికి లక్ష రూపాయల లోపు రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ జరగలేదు. వీళ్ళ సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నది. రెండు ఎకరాల లోపు ఉన్న సన్న చిన్న కారు రైతులు తీసుకున్న లక్షలోపు రుణం కూడా చాలామందికి మాఫీ కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంగా రేపో మాపో రుణమాఫీ వర్తిస్తుందని ఆశపడ్డ రైతులందరికీ నిరాశ మిగిలింది. 2 లక్షలకు పైన ఉన్న రైతులకు రుణమాఫీ చేసేది లేదు అంటూ వ్యవసాయ శాఖ మంత్రి చేసిన ప్రకటన రైతాంగాన్ని తీవ్ర అయోమయానికి గురి చేసింది. వీళ్ళ అందరి బాధలు ఇలా ఉంటే.. రుణమాఫీ వర్తించిన రైతుల పేర్లను ఇలా గ్రామాల్లో ప్రదర్శించడాన్ని వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మాకు ఇవ్వడానికి నిధుల కొరత అనీ, అప్పుడు పుట్టడం లేదని.. అనేకసాకులు చెప్తున్న పాలకులు ఇలా ప్రచారానికి మాత్రం కోట్ల ప్రజాధనాన్ని వినియోగించడం ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు? ఒక్కొక్క ఫ్లెక్సీలో 30 నుండి 40 మంది రైతుల పేర్లతో ఆయా గ్రామంలో ఉన్న మొత్తం మంది రైతుల పేర్లను ఒక యూనిట్ గా ప్రింట్ చేసి వాటిని పార్టీ కార్యకర్తల సహాయంతో గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట అందరికీ కనిపించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ప్రతి గ్రామంలో సుమారుగా 50 ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.ఒక్కొక్క ఫ్లెక్సీ ఖరీదు 350 రూపాయలని తెలుసుకున్న రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఖర్చుతో ఏర్పాటు చేయడం వల్ల రైతులకు జరిగే లాభం ఏమిటి అని ముక్కుసూటిగా నిలదీస్తున్నారు? ఏది ఏమైనా చేసిన పనిని చెప్పుకోలేకపోతున్నాం అంటూ స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలకే ఇలా కోట్ల ప్రజాధనాన్ని వృధా చేస్తూ ఇదిగో మా ఘనకార్యాన్ని చూడండి అంటూ ప్రచారం చేసుకుంటున్నారని... చేసేది ఏమీ లేక ఫ్లెక్సీల ముందు నిలబడి చారానకోడికి బారాన మసాలా అనే సామెతను గుర్తు చేసుకుంటున్నారు రైతన్నలు.

# బైక్ రేసర్ వీరంగం

### కానిస్టేబుల్‌పై బీర్ సీసాతో దాడి

హైదరాబాద్ : బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బైక్ రేసర్ వీరంగం సృష్టించాడు. వేగం దూసుకెళ్లి ఓ కారును ఢీకొట్టడమే కాకుండా.. అడ్డు వచ్చిన పోలీస్ కానిస్టేబుల్‌పై బీర్ సీసాతో దాడి చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. టోలి చౌకీ నుంచి వేగంగా దూసుకొస్తున్న బైక్ రేసర్ ఖాజా బంజారాహిల్స్‌లోని ఒమేగా హాస్పిటల్ వద్ద కారును ఢీకొట్టాడు. దీంతో కార్ డ్రైవర్, ఖాజా మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే సమయంలో బంజారాహిల్స్ పీఎస్‌లో డ్యూటీ- నిమిత్తం అదే రూట్‌లో వెళ్తోన్న కానిస్టేబుల్ శ్రీకాంత్ ఇద్దరినీ వారించే ప్రయత్నం చేశాడు. ఆగ్రహానికి గురైన బైక్ రైడర్ ఖాజా బీర్ బాటిల్‌తో కానిస్టేబుల్ శ్రీకాంత్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడ్డ కానిస్టేబుల్ శ్రీకాంత్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఖాజాపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న కానిస్టేబుల్ శ్రీకాంత్‌ను వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ పరామర్శించారు.

# వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

### అక్కడిక్కడే ఇద్దరు మృతి

సూర్యాపేట : సూర్యాపేట హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అనంతగిరి మండలం శాంతినగర్ పరిధిలో హైవేపై మొక్కలకు నీళ్లు కొడుతున్న నీళ్ల ట్యాంకర్ లారీని ఇన్నోవా కారు వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఇద్దరు ఘటనాస్థలంలోనే చనిపోయారు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూర్యాపేట జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సరిగ్గా రెండు రోజుల క్రితమే.. ఆటోను ఓవర్ టేక్ చేయబోయిన ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టడంతో ఒకే కుటు-ంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద చోటు-చేసుకున్నది. దంపతులు, ఎనిమిదేండ్ల కుమార్తె ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. తీవ్ర గాయాల పాలైన మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

# క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు గుల్ల

### ఆత్మహత్య చేసుకున్న యువకుడు
### ఆత్మహత్య పరిష్కారం కాదన్న సజ్జన్నార్

హైదరాబాద్ : మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల సోమేశ్ క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమేశ్ తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని తన కొడుకు సోమేశ్ తెల్లవారు 4గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తమ ఇంటి సమీపంలోని గౌడవెల్లిలో రైల్ ట్రాక్ పై పడుకొని ఆత్మహత్య చేసుకున్నడన్నారు. లక్షల్లో సోమేశ్ క్రికెట్ బెట్టింగ్ పెట్టాడని తెలిపారు. గతంలో తమ కూతురు వివాహం కోసం సోమేశ్ అప్పు చేశాడని అప్పు తీర్చామన్నారు. అందరితో బాగానే మాట్లాడాడని.. రాత్రి ఏం జరిగిందో? ఎవరు టార్చర్ చేశారో తెలియదన్నారు. మనోవేదనకు గురై సోమేశ్ సూసైడ్ చేసుకున్నాడని.. తమకు కడుపుకోత మిగిల్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన ఈ అన్యాయం ఎవరి కుటుంబంలో జరగకూడదని ఆ తల్లిదండ్రులు తెలిపారు. బెట్టింగ్ యాప్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సోమేశ్ చనిపోయే ముందు స్నేహితులకు వాట్సప్‌లో లొకేషన్ షేర్ చేశాడని.. తామంతా లొకేషన్ కి వెళ్లేసరికి మృతదేహం పడి ఉందని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాద ఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సమస్య ఏదైనా సరే.. ఆత్మహత్య అనేది పరిష్కారం కాదు అని యువతకు సూచించారు. బెట్టింగ్ భూతాన్ని పూర్తిగా నిర్మూలించడానికి సజ్జనార్ అవిరామ కృషి చేస్తున్న విషయం తెలిసిందే. సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో ఈవిధంగా రాసుకొచ్చారు. 'ఆన్ లైన్ బెట్టింగ్ భూతానికి వ్యసనపరులై బలవన్మరణాలకు పాల్పడకండి. ఆలోచించండి.. మీరు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల మీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంతటి క్షోభను అనుభవిస్తారో ఆలోచించండి. సమస్య వచ్చినప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలో అన్వేషించాలే తప్ప.. చనిపోవాలనే ఆలోచనే రాకూడదు. ఉన్నది ఒక్కటే జీవితం. ఏం సాధించిన అందులోనే. జీవన ప్రయాణంలో ఒక్కసారి కిందపడితే.. సర్వం కోల్పోయినట్లు- కాదు కదా. ఆముల్యమైన జీవితాన్ని అర్ధాంతరంగా కాలదన్నుకోవద్దు. చీకటి వెలుగులా నిత్యం కష్టసుఖాలు అందర్నీ వెంటాడుతూనే ఉంటాయి. కష్టకాలంలో బాధలను ఇతరులతో పంచుకోవాలి. పరిష్కార మార్గాలు వెతకాలి. ఎంత కష్టం వచ్చినా ఎల్లకాలం ఉంటు-ందా? చనిపోయినంత మాత్రాన సమస్యలు టక్కున మాయమవుతాయా!?.. బలవన్మరణం వద్దు.. బతికి సాధించడమే ముద్దు' అని యువతకు సూచించారు.

# విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం

### రిక్రూట్‌మెంట్లు పెరిగినా..డ్రాపౌట్స్ పెరగడమేమిటి
### తమ హయాంలో విద్యావ్యవస్థను పటిష్టం చేశామన్న హరీష్ రావు

హైదరాబాద్ : టీచర్ల రిక్రూట్‌మెంట్ జరిగినా.. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ పెరగడం ఏమిటని తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ పద్దులుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా వాడీవేడి చర్చ సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 26 వేల మందిని మాత్రమే రిక్రూట్ చేసిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే క్రెడిట్ తీసుకుంటుందని రాకేశ్ రెడ్డి విమర్శించారు. అంతమందిని రిక్రూట్ చేశారని చెబుతున్నారు. కానీ గతంలో ఒక్కటే కాలేజీ ఉండేది. ఇప్పుడు 100కు పెరిగాయి. కానీ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలు ఇంకా గణనీయంగా అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు. ఆయన తన ప్రసంగంలో విద్యా వ్యవస్థలో ఏర్పడిన లోపాలను ఎత్తిచూపారు. పదేళ్లలో 6,000 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని, గత ఏడాది లోపలే 1,800 స్కూళ్లు మూతపడిన విషయం గమనార్హమని చెప్పారు. అప్పుడు బంగారు తెలంగాణ అని చెప్పారు, ఇప్పుడు వజ్రాల తెలంగాణ అంటున్నారు. కానీ విద్యా రంగం మాత్రం దిగజారిపోతోంది. 1931 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉన్నాయి. ఇన్ని వేల కోట్ల బడ్జెట్ పెట్టినా పరిస్థితి మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. స్కూళ్లలో ఒకటే బాత్రూం ఉంటుంది, అక్కడ పందులు తిరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఎలా ప్రభుత్వ స్కూళ్లలో చదవగలరని అన్నారు. తల్లిదండ్రులు అప్పు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉంది. కానీ సీఎం దగ్గర చాలా పనులు ఉంటాయి. కాబట్టి ఈ శాఖను మరొకరికి అప్పగిస్తే మంచిది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని మెరుగుపరిచే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే డ్రాప్ ఔట్స్ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఎమ్మెల్యే సూచించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సీనియర్ సభ్యుల సూచనలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రి-టైర్డ్ ఆఫీసర్ల సహాయంతో పాఠశాలల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు రాకేశ్ రెడ్డి. స్కూళ్లకు కాంపౌండ్ వాల్, శుభ్రమైన వసతులు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాల న్నారు. ఇకపోతే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.

# హోంశాఖ నా ఫేవరేట్: కోమటిరెడ్డి

హైదరాబాద్ : మంత్రి పదవి వస్తదనే అనుకుంటున్నా... కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాజాగా మీడియా చిట్‌చాట్‌లో ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. భువనగిరి ఎంపీ బాధ్యతలు ఇస్తే.. సమర్థవంతంగా నిర్వహించానని గుర్తు చేశారు. తనకు హోంమంత్రి పదవి అంటే ఇష్టమన్నారు. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు.. నిన్న ఢిల్లీలో సీరియస్ గానే కేబినెట్ పై చర్చ జరిగినట్లు ఉందన్నారు. తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు ముహూర్తం దాదాపుగా ఖరారు అయింది. ఉగాది నాటికి విస్తరణ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు- సమాచారం. గత ఏడాదిన్నరగా విస్తరణకు సంబంధించి అనేక ఊహగానాలు వినిపించినప్పటికీ తాజాగా అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. క్యాబినేట్ విస్తరణతో పాటు ఇతర పదవులు... నామినేటెడ్ పోస్టుల నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. సీఎంతో పాటు- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. వీరంతా రాహుల్ గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాలుగు మంత్రి పదవులు ఎవరికి ఇవ్వలని నిర్ణయం తీసుకున్నారో తెలియాల్సి ఉంది.

# మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

### ప్రమాదంలో గాయపడ్డ యువతి

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని బాలనగర్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసు సంచలనం రేపింది. మద్యం మత్తులో ఓ యువకుడు ఫార్చునర్ కారుతో యువతిని బలంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో 19 ఏళ్ల యువతి సాయి కీర్తి తీవ్రంగా గాయపడింది. మంగళవారం ఉదయం బాలనగర్ ఐడీపీఎల్ చౌరస్తాలో ఈ ఘటన జరిగింది. ఫార్చునర్ కారులో అతివేగంగా ప్రయాణిస్తున్న యువకుడు మద్యం మత్తులో ఉండటంతో అదుపుతప్పి రోడ్డుపై నడుస్తున్న సాయి కీర్తిని ఢీకొట్టాడు. అయితే, ఆక్సిడెంట్ చేసిన వెంటనే కారు ఆపకుండా అక్కడి నుంచి పరుగుతీశాడు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు నేరుగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని ఫతేనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతడిని బల్కంపేట్‌కు చెందిన గొగం అనిల్‌గా గుర్తించారు. దర్యాప్తులో అనిల్ తన స్నేహితులతో కలిసి మొయినాబాద్‌లోని ఓ ఫాం హౌస్‌లో పార్టీ చేసుకున్నట్లు- పోలీసులు వెల్లడించారు. పార్టీ అనంతరం మద్యం మత్తులోనే కారును నడిపాడు. అతివేగం, మద్యం మత్తే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయి కీర్తిని అత్యవసర చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

# సంపాదకీయం

## కానరాని ఆర్థిక పునరుత్తేజం!

ఆర్థిక పునరుత్తేజం కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వేసుకున్న లెక్కలు తలకిందులు అయ్యాయి. క్షీణిస్తున్న రూపాయి విలువతో ఈ ఏడాది ఆసియాలోకెల్లా బాగా దెబ్బతిన్న కరెన్సీ ఇప్పుడు మనదేననడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, స్టాక్‌మార్కెట్ కష్టాలు సరేసరి. ఈ మధ్య అవి కూడా తలకిందులు అవుతున్నాయి. భారత్ ఇప్పుడు ఆర్థిక, వాణిజ్య లోటులు రెంటినీ ఎదుర్కొంటోంది. జాతీయ, అంతర్జాతీయ ధరలు పెరుగుతుండడంతో దేశంలో ద్రవ్యోల్బణంపై తన వైఖరిని భారత రిజర్వ్ బ్యాంక్ పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ధరలు ఇలానే పెరుగుతూ పోతే, వృద్ధిపై గట్టి దెబ్బ పడుతుంది. ఆర్బీఐ తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోకుండా చూడాలి. ప్రజల్లో ఆర్థిక లావాదేవీలు పెరగాలి. సత్వర కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజలకు పనులు కల్పించే పనులు చేయాలి.ప్రజల్లో రూపాయి చలామణి అయ్యేలా చేయాలి. ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ధాన్యం నిల్వలు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తే తప్ప ఆర్థిక రంగం బలపడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే దేశంలో ఆర్థిక విధానాలు నానాటికి దిగజారుతున్నాయి. కేవలం పన్నులు మీద ఉన్న శ్రద్ధ మరోదానిపై కనిపించడం లేదు. ప్రతిదీ పన్నుల కింద జమకట్టం, బ్యాంకుల వడ్డింపులు, వడ్డీల తీరు కారణంగా సామాన్యులకు జీవించడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉన్నది పన్నులు వసూలు చేయడానికి తప్ప ప్రజల కోసం కాదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రుజువు చేసుకున్నాయి. డిల్లీలో కూర్చుని లెక్కలు వేయకుండా ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలు వేస్తే ఆర్థిక పరిస్థితి ఏంటన్నది చూడాలి. బంగారం కొనడానికి లేదు. పుస్తెలు చేయించాలంటేనే భయపడే రోజులు దాపురించాయి. అదేపనిగా బంగారం,వెండిధరలు పెరిగి పోతున్నాయి. భూములు అందుబాటులో లేవు. అలాగే ఇళ్లు కట్టుకునే వీలు లేదు. ఆహార ధాన్యాలు కొనే ధైర్యం లేదు. తిండి తినడం కూడా భయంగా మారింది. బ్యాంకులు ఎగవేతదారులను వదిలి సామాన్యుల వెంట పడుతున్నాయి. ఇలా అన్ని విధాలా ధరలు పెరిగిపోతున్నా..పాలకులు పట్టించు కోవడం లేదు. సరికదా అభివృద్ధికి ఇదే సూచిక అని చంకలు గుద్దుకుంటున్నారు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు కూడా ప్రజల జీవనంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచమంతటినీ తాకుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా మనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్కడి సెగ ఇక్కడి మన స్టాక్ మార్కెట్లు, మదుపరులు, ఆర్థిక విధాన నిర్ణేతలు ఇలా ప్రతి ఒక్కరికీ తగులుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడనుంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్ల పతనం, ఎన్నడూ లేనట్టు డాలర్‌కు 85 రూపాయల స్థాయికి కరెన్సీ విలువ క్షీణించడం, పెరగనున్న చమురు ధరలు వెక్కిరిస్తున్నాయి. అనేక అవాంతరాల మధ్య క్రమంగా కోలుకుంటోందని భావిస్తున్న దేశ ఆర్థికరంగం రానున్న రోజుల్లో ఇంకెంత ఒత్తిడికి గురవుతుందోనని ఆందోళన కలుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతుండడం మన ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలు కానుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోతోంది. చమురుకు తోడు వంటనూనెలు ఉన్నాయి. ప్రపంచం లోసన్‌ఫ్లవర్ నూనెలో అయిదింట నాలుగొంతులు రష్యా, ఉక్రెయిన్‌ల ఉత్పత్తి కావడం గమనించాలి. మన సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతుల్లో 90 శాతం ఆ రెండు దేశాల నుంచే వస్తాయి. పామాయిల్, ఆవనూనెల ధరలు ఇప్పటికే పైకి చూస్తున్నాయి. మన దగ్గర ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా వాణిజ్య పరంగా వాటిని ఎగమతులు చేసుకునే వ్యూహాలు కానరావడం లేదు. పసుపు, మిర్చి,అల్లం, వెల్లుల్లి, బియ్యం, పత్తి వంటి వాణిజ్య పంటలను అత్యధికంగగా ఎగుమతి చేసుకునే విధానాలు రూపొందాలి. మన ఎగుమతులను సమీక్షించకుండా అదే పనిగా దిగుమతులు పెరిగితే ద్రవ్యోల్బణం పెరగడమే గాకుండా రూపాయి మారకవిలువ కూడా పెరగడం ఖాయం. వంటనూనెలు మరింత ప్రియం కానున్నాయి. కీలకమైన ఈ ఇంధనాల ధరలు ఇలా పెరిగిపోతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. ధరలు ప్రజల శక్తికి మించి పెరుగుతున్న చోట సామాజిక సంక్షోభం తలెత్తనుంది. నిత్యావసర సరకులు కొనుక్కోలేని అశక్తత ఏర్పడి అది అశాంతిని సృష్టించి వీధుల్లో అలజడికి కారణం అవుతుంది. ఈ కారణంగగా మన దేశీయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం తప్పనిసరి. అలాగే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా ఆర్థిక కార్యకలాపాలు సాగాలి. ఎగుమతులను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. అమ్మకాలతో లాభం లేదని గుర్తించాలి. ఇవేవీ చేయ కుండా ఎన్ని కసరత్తులు చేసినా లాభం లేదని గమనించాలి. ఆర్తిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకముందే పాలకులు మేల్కోవాలి. లేకుంటే పరిస్థితి సామాజిక సంక్షోభానికి దారితీయగలదని గుర్తించాలి. మనం పండిస్తున్న మిర్చి, పసుపు, పత్తి లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి. ఇక్కడి ఉత్పత్తులు ప్రజలకు చేరాలి. ప్రభుత్వం సరైన మార్కెంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గితే తప్ప రియల్ రంగం పుంజుకోదు. ఇవన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థికరరంగం గాడిన పడదు.

## పెట్రోల్, డీజిల్‌లను జిఎస్టీ పరిధిలోకి తేవాలి




### ఎక్సైజ్ సుంకాలు తగ్గించుకోవాల్సిందే

### పన్నులపై ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి

న్యూఢిల్లీ : పన్నుల వ్యవస్థలో సహేతుకమైన మార్పులు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ జనాన్ని దోచుకోడం మానుకోకుంటే సమాజంలో అస్థిరతకు కారణం కాగలదు. పెట్రోల్, డీజెల్, వంటగ్యాస్‌పై పన్ను అక్కడికక్కడే చేతికి వచ్చి ఖజానాలను నింపుతాయి కాబట్టి వాటిని తగ్గించుకోడానికి పాలకులు వెనకాడుతున్నారు. అనుత్పాదక రంగాలకు అతిగా ఖర్చు పెట్టడం మానుకోవాలి. ఓట్లను రాబట్టే పథకాలను పక్కన పెట్టాలి. వస్తు, సేవల పన్ను నుంచి పెట్రోల్, డీజెల్‌ను మినహాయించడంలో ఆంతర్యం వాటి మీద తాము ఎప్పుడుబడితే అప్పుడు పన్నులను విధించి రాబడి పెంచుకోవాలన్న దురుద్దేశ్యం తప్ప మరోటి కానరాదు. ఇంధన ధరలను అదుపు చేయడంతో పాటు, సామాన్యులకు కూడా ధరలు అందుకునేలా ఉండాలి. పెట్రోట్, డీజెల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకోడం సరైన నిర్ణయంగా గుర్తించాలి. అదేపనిగా పన్నుల రూపంలో ప్రజలను దోచుకోవడం తగదని గుర్తించాలి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రజలపై భారాలు మోపడం సరికాదని పాలకులు గమనించాలి. పెట్రోలులపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గించుకుంటేనే ఆ మేరకు వీటి ధరలు తగ్గి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విధించే స్పెషల్ సుంకాలలో రాష్ట్రాలకు వాటా వుండదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తన ఆదాయానికి ఈ స్పెషల్ సుంకాల విధింపుపై ఆధారపడడం ఎక్కువైంది. ఇలాంటి సుంకాలతో భారం మోపే బదులు పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవడం మంచిది. కానీ తాజాగా ఎంపిల జీతభత్యాలను, పెన్షన్లు పెంచుకున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. పెట్రోల్ చిల్లర ధరలో 54 శాతం కేంద్ర, రాష్ట్రాలు విధించే పన్నుల కిందే పోతుంది. అలాగే డీజెల్ ధరలో 49 శాతం ఈ పన్నులే వుంటాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌పై ప్రతి లీటర్ వద్ద రూ. 32.9 మేరకు ఎక్సైజ్ సుంకాన్ని వసూలు చేస్తున్నది. అలాగే డీజెల్ మీద రూ. 31.8 తీసుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్నులు ఇందుకు అదనంగా వుంటాయి. జిఎస్టీ పేరుతో ఇప్పటికే వాయింపులు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. నేలవిడిచి సాము చేసే పద్ధతిని విడనాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజెల్‌పై తాము వసూలు చేసే పన్నులను గణనీయంగా తగ్గించుకోగలిగితే ప్రజలపై భారం తగ్గి వాటిని సునాయాసంగా కొనుగోలు చేయగలుగుతారు. దేశంలో వినియోగిస్తున్న చమురులో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఓఎన్‌జిసి కష్టపడి శోధించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను పూర్తి స్థాయిలో వెలికి తీయకుండానే ఈ రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించారు. దానితో ప్రైవేటు కంపెనీలకు మేలు చేసిన వారు అవుతున్నారు. ఈ లెక్కన త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజెల్ ధరలు కనీసంగా రూ.115 లకు చేరే ప్రమాదమున్నది. ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను పక్కన పెట్టి ప్రజలను పన్నుల భారం నుంచి తప్పించాలి. దుబారా తగ్గించుకోవడం చేయాలి.

## పేదరిక నిర్మూలనకు కృషి జరగాలి

### ఐక్యరాజ్యసమితి సూచనలు శిరోధార్యం కావాలి

న్యూఢిల్లీ : మనిషి ఎదుగడానికి అభివృద్ధి మార్గాలు తెరిచి పెట్టడమే పేదరిక నిర్మూలన పథకాల లక్ష్యం కావాలని ఐక్యరాజ్య సమితి ఘోషిస్తున్నది. ఈ భావనతోనే అభివృద్ధి వ్యూహాలకు రూపకల్పన చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులకు ప్రచారార్భాటమే తప్ప పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ప్రకటించలేదు. అందుకే ప్రజలకు దానిపై ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. బడ్జెట్ అంటే సంవత్సరానికొక్కమారు ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రవేశపెట్టే తద్దినంగా ప్రజలు భావించే స్థితి వచ్చిందంటే దానికి కారణం పాలకులు వాటిని వాస్తవ పరిస్థితులకు దూరంచేసి అంకెల గారడీగా మార్చడమే. పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు జవజీవాలు సమకూర్చడం, కులవృత్తులకు ఆలంబన, గ్రామీణ సమాజాన్ని అభివృద్ధి కాముకమైనదిగా చూడటం మొదలైనవన్నీ ఆర్థిక ప్రగతికి దోహద పడతాయి. పదేళ్లపాటు నిరాఘాటంగా పాలన చేసిన కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాలను సర్వనాశనం చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కులవృత్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చిన్ననీటి పారుదల రంగం వట్టి పోయింది. ప్రాజెక్టులు, మేఘమధనం పేరుతో ఉమ్మడి ఎపిని దోచుకుతిన్నారు. అయితే ఇలాంటి వారే ఇప్పుడు గగ్గోలు పెడుతన్నారు. గతంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించడం ఖర్చుల్లో కోతలు పెట్టడం ప్రభుత్వాల ఘన కార్యాలుగా చెప్పుకున్నారు. బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం, భారాలు తరువాత వేయడం కూడా మరో ఎత్తుగడ వేయడం కాంగ్రెస్ హయాంలో జరిగిందని చెప్పడానికి అనుమానాలు అక్కర్లేదు. వార్షిక బడ్జెట్‌లో ఇలాంటి విన్యాసాలన్నిటినీ గతంలో ప్రదర్శించారు. బడ్జెట్ అంకెలకూ వాస్తవ ఖర్చులకూ సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవహారాలు నడిచాయి. సామాజికాభివృద్ధిని ఆర్థిక కోణంలోనే చూడలేము. పారిశ్రామికాభివృద్ధి ఒక్కటే కొలమానం కాదు. సమాజ సంపూర్ణ వికాసమే అసలైన అభివృద్ధి అని గుర్తిస్తేనే ముందుకు సాగుతాం. గ్రామీణ శ్రామిక సమాజ శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగంలోకి తేవడానికి బృహత్ ప్రయత్నం సాగడం ముఖ్యం. అభివృద్ధి ముసుగు తొడిగిన విదేశీ ఆర్థికవేత్తల సలహాలు, ఆధునికత పేర అడుక్కు తెచ్చుకున్న ఆర్థిక నమూనాలు కాదు మనకు కావలసింది. మన సమస్యలకు మన దేశీ య విధానాలలోనే పరిష్కారం సాధించాలన్న దృక్పథంతో ముందుకు సాగుతున్న తీరు ముదావహం. రైతులు, గొర్రెల పెంపకం దారులు, చేపలు పట్టేవారు, కంసాలి, కమ్మరి, వడ్రంగి వంటి విశ్వకర్మవర్గీయులు, నేతపనివారు– ఇట్లా సమస్త వృత్తుల సమాహారమే గ్రామీణ సమాజం. వీరందరికి కులవృత్తులలో తరతరాలుగా పెంపొందించుకున్న అపారమైన నైపుణ్యం ఉంటుంది. ఉన్నత విద్యావంతులు కూడా వృత్తి నైపుణ్యంలో వీరికి సరితూగ లేరు. గ్రామీణ సమాజంలో అపారంగా ఉన్న మానవ వనరులను, వృత్తి నైపుణ్యాన్ని తగురీతిలో ఉపయోగంలోకి తేవడమే లక్ష్యమని గమనిస్తే తెలిసిపోతుంది. ఓ రకంగా గతంలో కన్నా మేలైన కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇదంతా అభివృద్ధి నిర్మాణంలో భాగంగా సాగుతున్నదని గుర్తించాలి.

## దక్షిణాదిలో డీలిమిటేషన్ కాక

### హుటాహుటిని ఢిల్లీకి పళనిస్వామి

చెన్నై : దక్షిణాదిలో డీలిమిటేషన్ వ్యవహారం కాకరేపుతున్న తరుణంలో అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ సిఎం పళని స్వామి హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో కేంద్రంపై పోరాటానికి దిగారు. ఇప్పటికే పార్లమెంట్ ఉభయసభల్లో డీఎంకే సభ్యులు పోరాటం చేస్తున్నారు. ఇటీవల చెన్నై వేదికగా దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పంజాబ్ నుంచి ముఖ్యమంత్రులు, డిప్యూటీ– సీఎంలు హాజరై తమ గళాన్ని తెలియజేశారు. డీలిమిటేషన్‌తో ఏర్పడే విపత్తును గురించి ప్రస్తావించారు. తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు– చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదిలా ఉంటే డీలిమిటేషన్‌పై ఉద్యమం ఉధృతం అవుతున్న వేళ బీజేపీ అధిష్టానం అప్రమత్తం అయింది. తమిళనాడు అన్నాడీఎంకే ప్రధాని కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళినిస్వామికి కబురు పంపింది. దీంతో ఆయన అత్యవసరంగా దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరారు. ఢిల్లీలో బీజేపీ అగ్ర నేతలను కలిసే అవకాశం ఉంది. సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసే ఛాన్సుందని తెలుస్తోంది. అంతేకాకుండా వచ్చే ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మరోసారి బీజేపీ–ఏఐడీఎంకే పొత్తు ఉండే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఏఐడీఎంకే పార్టీ ఆఫీసును ఈపీఎస్ ప్రారంభించనున్నారు.

## దిగుమతులపై ఆధారపడితే ముప్పే


న్యూఢిల్లీ : ప్రపంచ సరకుల మార్కెట్లలో రష్యాది ప్రధాన పాత్ర కావడంతో అక్కడి కుదుపులన్నీ మనపై ప్రభావం చూపక మానవు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సహజవాయు ఎగుమతిదారు రష్యా. రెండో అతి పెద్ద చమురు ఎగుమతిదారూ ఆ దేశమే. ఆ దేశ జీడీపీలో అయిదోవంతు వీటి పుణ్యమే. ప్రపంచ చమురు దిగుమతుల్లో 12 శాతం రష్యా నుంచే వస్తాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుంచి ముడి చమురు ఫ్యూచర్లు 26 శాతం పైగా పెరిగాయి. గత డిసెంబర్‌లో బ్యారల్ 70 డాలర్లున్న అంతర్జాతీయ ముడి చమురు ధర ఇప్పుడు దాదాపు రెట్టింపు అయింది. చమురు అవసరాల్లో 85 శాతానికి దిగుమతులపైనే ఆధారపడ్డ దేశం మనది. ఇప్పుడిక ముడిచమురు దిగుమతి ఖర్చు భారీగా పెరుగుతుంది. చమురు కోసం రష్యాపై ఆధారపడ్డ పాశ్చాత్య దేశాలు తంటాలు పడుతున్నాయి. చమురు ధరల కారణంగా పెరిగే ఆ ఖర్చు ప్రభావం సరకుల రవాణా మీద పడుతుంది. సరకుల రేట్లకు రెక్కలొస్తాయి. ఆహార ధరలు పెరుగుతాయి. గోధుమలు, మొక్కజొన్న, బార్లీ ప్రపంచ ఎగుమతుల్లోనూ రష్యా, ఉక్రెయిన్లది గణనీయమైన పాత్ర. వాటి రేట్లూ పెరుగుతున్నాయి. మన ఎరువుల దిగుమతుల్లో దాదాపు 17 శాతం పొటాష్, 60 శాతం ఎన్పీకే ఎరువులు రష్యావే. ఈ క్రమంలో దిగుమతులపై ఆధారపడ్డ మనం ధరల దాడిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

## ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు మావోల హతం

రాయపూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులను మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు దంతెవాడ, బిజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న అడవిలో ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో కాల్పులు జరిపారు. మావోయిస్టులకు, భద్రతా దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు– తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు– పోలీసులు తెలిపారు. ఇంకా ఆపరేషన్ కొనసాగుతుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు.కాగా, ఈ నెల 20వ తేదీన బీజాపూర్, కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## సకల జీవరాశుల సంక్షేమం

తిరుమల : ప్రతి రోజూ– తనకు సంబంధం లేని మనిషి క్షేమం కోరి హృదయపూర్వక ప్రార్థన చేసే వ్యక్తికి అదే ఆరోగ్యం, ఆనందం! వాటి కోసం అతడు ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. అలా ప్రార్థన చేస్తున్నప్పుడే, శరీరంలో మార్పులు కలుగుతాయి. మనసులో చక్కటి భావ ప్రకంపనలు ఏర్పడి, ధ్యానంగా మారి, రోగాల్ని దూరం చేస్తాయి. ఇది యోగుల బోధ.సర్వుల హితం కోరడంలో ప్రేమ ఇమిడి ఉంటుంది. ఎవరి కోసం వారే ఉంటే, ఆ జీవితం నిష్ఫలం. దానికి ప్రాముఖ్యం, అర్థం ఉండవు. మనిషి జీవితం ఏ క్షణం నుంచి ఇంకొకరి కోసం సాగుతుందో, ఆ క్షణం నుంచే సేవాభావం వెలుగొందుతుంది. సేవ కేవలం హృదయానికి సంబంధించినదై ఉండాలి. దాన్ని ఆలోచనలు, మాటలు అనుసరించాలి. ఆలోచనను హృదయం ఎప్పుడూ మంచి దారిలోనే నడిపిస్తుంది. హృదయం ఒక దిక్సూచి. ప్రేమకు అది కేంద్రస్థానం. సేవ, ప్రేమల్ని మనిషి కళలుగా నేర్చుకోవాలి. అదే సమగ్ర జీవిత కళ. అహంకారాన్ని విడనాడాలి. ఉపనిషత్తులకు ప్రాధాన్యాల పట్టిక ఉంది. అందులో అన్నింటికన్నా ముందు ఉండేది మానవత్వమే.సకల జీవరాశులూ చల్లగా ఉండాలన్న భావన పెరిగేకొద్దీ, మనిషి అసలైన ఆనందానికి అర్థం తెలుసుకుంటాడు. అటువంటి నామస్మరణ ఉన్న చోట, మంచి వెల్లివిరుస్తుంది. అప్పుడే రుషులు సంతోషిస్తారని, దేవతలు దీవిస్తారని ఉపనిషత్ వాక్యం!



ఆధ్యాత్మికం

# సింగరేణి ఉద్యోగులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ వకీల్ పల్లి గని ఉద్యోగులకు మంగళవారం ఆరోగ్య శాఖ వారు ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్ జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ఆదేశానుసారం, గని యాజమాన్యం గని ఆవరణలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ పద్మ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఎండలోకి వెళ్లినప్పుడు లేతరంగు దుస్తులు, తలకు టోపి లేదా, తలపాగా ధరించాలన్నారు. వడదెబ్బ తగిలినపుడు తలనొప్పి, తల తిరగడం, వాంతులు కావడం, నీరసం, వొళ్ళు నొప్పులు, కండరాల నొప్పులు లాంటి లక్షణాల ఉంటాయని, వడదెబ్బ తీవ్రమైతే స్పృహ కోల్పోయి అపస్మారక స్థితి లోకి వెళ్ళే అవకాశం ఉంటుందన్నారు. ఇక వడదెబ్బకి గురైన వ్యక్తిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి, అతని శరీరానికి గాలి తగిలేలా చూడాలని, అతను స్పృహలో ఉంటే "ఓఆర్ఎస్" ద్రవం లేదా, నిమ్మరసం లేదా, మజ్జిగ ను కొద్దికొద్దిగా తాగించి, వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు. వేసవి కాలంలో నీళ్లు ఎక్కువగా తాగాలని, పుచ్చకాయ, కీర దోసకాయ, వంటివి తినాలని, తరచు నిమ్మరసం లేదా, మజ్జిగ లేదా, కొబ్బరినీళ్లు తాగాలని ఆమె సూచించారు. మద్యపానం, శీతల పానీయాలు, మాంసం, వేపుడు వంటలు తీసుకోకూడదన్నారు. ద్విచక్ర వాహన దారులతే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డాక్టర్ పద్మ సూచించారు. ఈ సదస్సులో గని అఫిషియేటింగ్ మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి రామ్ కుమార్, డివైపిఎం శ్యామ్ ప్రసాద్, కార్మిక నాయకులు రాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జె.ఎన్.టీ.యు.సిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

**- బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్**



**కూకట్ పల్లి మార్చ్ 25 (ది క్రైమ్ న్యూస్):** జె.ఎన్.టి.యు.సీ లో నెలకొన్న పలు సమస్యల పై బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, సందీప్ లతో కలిసి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి ని కలిసి పలు సమస్యల పరిష్కారానికై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ జేఎన్టీయూసి విశ్వవిద్యాలయం విద్యార్థుల హాస్టల్ లో మంచినీటి సమస్యలు, మెస్ సమస్యలను, బి.బి ఏ, ఎం.బీ.ఏ కోర్సులకు సంబంధించిన సమస్యలను అలాగే స్పోర్ట్స్ మెటీరియల్ పైన వీసీని కలవడం జరిగిందన్నారు. ఇందుకు విసి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే యూనివర్సిటీలో ధర్నాలు చేయొద్దని సర్కులర్ జారీ చేసిన విధానం సరైనది కాదని విద్యార్థులకు సమస్యల మీద ప్రశ్నించే అవకాశాన్ని యూనివర్సిటీ వేదికల మీద తప్పకుండా కల్పించాలని విసి ని కోరితే రాజకీయపరమైన అంశాలు తప్ప విద్యారంగ సమస్యల పై ఆంక్షలు లేకుండా చూస్తామని చెప్పారని అన్నారు. యూనివర్సిటీకి సంబంధించిన అనేక అంశాల పై విసి తో మాట్లాడడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఏత్తరి రమేష్, రంజిత్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షానికి పెద్దపల్లి మండలంలో వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోవడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బిజెపి నేతలు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అకాల వర్షం ఆరుకాలం కష్టపడి పండించిన రైతులకు తీవ్ర దుఃఖాన్ని మిగిలించిందని ,ఈ వడగండ్ల వర్షం వల్ల వేల ఎకరాల మొక్కజొన్న గాలివానకు పూర్తిగా పడిపోయి దెబ్బ తినడమే కాకుండా రాళ్ల వర్షంతో వరి పొలాల్లో వరి గొలుసులకు ఒక్క వరి గింజ కూడా లేకుండా రాలిపోవడం జరిగిందని,పెట్టుబడి పెట్టి వరి, మొక్కజొన్న సాగు చేస్తే పంట చేతికి అందే సమయానికి అకాల వర్షం వల్ల పూర్తిగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో రైతంగం ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని,వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో ప్రతి గ్రామ గ్రామాన సర్వే చేయించి ఈ వడగండ్ల వర్షం వాళ్ళ నష్టపోయిన రైతులకు మొక్కజొన్న, వరికి ప్రతి ఎకరాకు 50 వేల చొప్పున ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతుకు నివేదికల ఆధారంగా తక్షణమే నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ డి 83 మరియు డి 86 కెనాల్ ల క్రింద లక్షల ఎకరాలు పెద్దపెల్లి అసెంబ్లీ పరిధిలో సాగు చేయడం జరుగుతుందని, ఇవాళ ఎస్సారెస్పీ జిల్లా అధికారులను సంప్రదించగా వారి గైడ్లైన్స్ ప్రకారం ఈ వచ్చే తడి ఒకటి మాత్రమే ఇస్తామని వారు చెప్పడం జరిగిందని, కాని ఒక తడి మాత్రమే ఇస్తే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది కావున అదనంగా ఇంకొకసారి కూడా ఇవ్వాలని మేము తమరి ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బిజెపి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, టౌన్ అధ్యక్షులు పెంజర్ల రాకేష్, ఓదెల మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్, కావేటి రాజగోపాల్, తంగడ రాజేశ్వర్ రావు, వొల్లె తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, ముంజ రాజేంద్రప్రసాద్, సబ్బు మల్లయ్య, గాదాసి సతీష్, కుక్క అంజి మధు, శివయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఆదాయం పెంచుకొని పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- 100% పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ
- మూడు మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ తయారీపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అనవసర ఖర్చులు తగ్గించి, మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకొని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత కలెక్టరేట్ లో 3 మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ తయారీపై అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయ వనరుల పై కౌన్సిల్ సమావేశంలో చర్చ నిర్వహించి ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకోవలసిన చర్యల పై దృష్టి సారించాలని అన్నారు. మన మున్సిపల్ పరిధిలో ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే మన వార్డులు డివిజన్లలో మరింత అభివృద్ధికి అవకాశం ఉన్నదని తెలిపారు. మున్సిపల్ ఆదాయం పెంచుకున్న సందర్భంలో మనకు కావాల్సిన అభివృద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 100% పన్ను వసూలకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు.ప్రస్తుతం పట్టణాలను సుందరంగా, ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందనీ, ఇంకను ఆదాయ మార్గాలు పెంచుకున్నప్పుడు పలు రకాల, మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. పట్టణాలలో ఆదాయం మార్గాలు పెంచుకునేందుకు పన్నుల అవసరమైన చోట రీ - అసెస్మెంట్ చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యయాలు



తగ్గించుకుంటూ, ఆదాయాన్ని జాగ్రత్తగా వాడుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలనీ తెలిపారు. పట్టణాలలో ప్రాధాన్యత ప్రకారం పనులు చేపట్టాలని , ప్రజల మౌలిక వసతుల కల్పన పనులకు ముందుగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని అన్నారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

- మండల వ్యవసాయాధికారి నాగార్జున
- ఊషన్నపల్లి పాఠశాలలో 'వారానికో వక్త' కార్యక్రమ నిర్వహణ
- పిల్లలకు పంటల రకాలపై అవగాహన

**సుల్తానాబాద్, మార్చి 24( ది క్రైమ్ న్యూస్ ):** పాఠశాల పిల్లలు ఇష్టపడి చదువుతేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాల్వశ్రీరాంపూర్ మండల వ్యవసాయాధికారి నాగార్జున అన్నారు. సోమవారం ఆయన కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (స్వయం అభ్యసన కేంద్రం) లో 'వారానికో వక్త' కార్యక్రమంలో భాగంగా భోజన విరామ సమయంలో 'పంటలు - రకాలు' అనే అంశంపై మాట్లాడారు. పాఠశాల పిల్లలకు వివిధ అంశాలపై అవగాహన కలిగించేందుకు ఊషన్నపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య 'వారానికోవక్త' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం విదితమే. ప్రతి వారం పాఠశాలకు ఒక ముఖ్య అతిథిని పిలిపించి వివిధ విషయాలపై ప్రసంగాలు ఇప్పిస్తుంటారు. అందులో భాగంగా సోమవారం మండల వ్యవసాయాధికారిని పాఠశాలకు ఆహ్వానించి 'పంటలు - రకాలు' అనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పించారు. అలాగే సాధారణ, వ్యాపార పంటలు, ఎరువులు, పురుగు మందుల గురించి పిల్లలకు వివరించారు. పిల్లలు చిన్నప్పటి నుంచి అన్ని సబ్జెక్టులను ఇష్టపడుతూ బాగా చదవడం వల్ల ఉన్నత స్థానంలో స్థిరపడవచ్చుని, ఆ దిశగా పిల్లలు ప్రయత్నించాలని నాగార్జున కోరారు. తర్వాత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ పిల్లలు ఏకాగ్రతతో చదివినప్పుడు అద్భుతమైన ఫలితాలు సాధిస్తారన్నారు. ఊషన్నపల్లి పాఠశాలలో చదువుతున్న పిల్లల్లోని అంతర్గత శక్తుల్ని వెలికి తీసి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తల్లిదండ్రులు తమ



పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఈర్ల సమ్మయ్య కోరారు. అనంతరం పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థిని పొన్నాల శ్రీనిధి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీనిధి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విద్యా బుద్ధులతో వర్ధిల్లాలని ఎఓ నాగార్జున, హెచ్ఎం ఈర్ల సమ్మయ్య, టీచర్ శ్రీవాణి ఆమెను దీవించి ఆశీర్వదించారు. పిల్లలు జన్మదిన వేడుకల పాట పాడుతూ శ్రీనిధికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగార్జున, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయిని శ్రీవాణి, పిల్లలు, పలువురు పాల్గొన్నారు.

# సంస్థ ప్రగతి, ఉద్యోగుల మనుగడ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కనీస వేతనాలు సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్

**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి ప్రగతి, ఉద్యోగుల మనుగడ కేవలం కాంగ్రెస్ పార్టీ పాలనలోనే సాధ్యమని, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో సింగరేణి సంస్థను వేలం పాటలో పెట్టింది బిజెపి ప్రభుత్వం అయితే, వేలం పాటలో తన బంధువులను పాడకునే విధంగా చేసి టెండర్లు పొంది, సంస్థ ప్రగతిని, ఉద్యోగుల మనుగడను కుంటుపర్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. నాడు వేలం పాటలో పాల్గొనవద్దు అంటూ సింగరేణికి పలు ఆంక్షలు పెట్టింది, అవి పెట్టుబడి దారులకు టెండర్లు వచ్చేలా చేసి, సంస్థకు కొత్త గనులు లేక సంస్థ ప్రగతికి, ఉద్యోగుల మనుగడ లేకుండా చేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అంటూ ప్రశ్నించారు. ఇలా బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు అనేక బొగ్గు గనులను మూతవేయడం, కొత్త గనులను తమ అనుచర వర్గాలైన పెట్టుబడిదారులకు అప్పగిస్తూ, సొమ్ము చేసుకున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, ప్రధానంగా కేసీఆర్ దేనని ఆయన దుయ్యబట్టారు. కొత్త గనులను ప్రారంభించి, సింగరేణి సంస్థ ప్రగతికి, కార్మిక వర్గం మనుగడ, రాష్ట్ర పురోగభివృద్ధి జరుగుతుందని ఆశించి అధికారం అందించిన తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కేసీఆర్ ప్రభుత్వం వమ్ము చేసిందని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే, సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, మూతపడిన గనులకు ఉత్పత్తి లక్ష్యాలను కేటాయించి, వాటిని పునర్ ప్రారంభింపజేసి, నేడు వేలమంది ఉద్యోగులు వీధిన పడకుండా చేయడంలో ఐఎన్టీయూసి ప్రధాన పాత్ర పోషించిందన్నారు. అలాగే కేసీఆర్ ప్రభుత్వ హాయంలోనే రాష్ట్ర విద్యుత్ సంస్థల నుండి సింగరేణికి రావాల్సిన 35 వేల కోట్ల



బకాయిలను రాబట్టే విషయం, వేలం పాట ద్వారా కొత్త గనులను ప్రారంభించేందుకు, కొత్త విద్యుత్ ప్లాంటు ల ఏర్పాటుకు కూడా తమ యూనియన్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లిందని, దానిపై రాష్ట్ర పాలకవర్గం సానుకూలంగా ఉందని తెలిపారు. అలాగే సొంతింటి కల సాకారం చేసేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరమైన స్థలం కోరకు అన్వేసిస్తుందన్నారు. ఇలా సింగరేణి ఉద్యోగులకు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలను కల్పించేందుకు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఐఎన్టీయూసి అనునిత్యం అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. ఇక ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన యూనియన్ రామగుండం రెండవ బ్రాంచ్ కార్యవర్గాన్ని జనక్ ప్రసాద్ పరిచయం చేశారు. ఇంకా ఈ విలేకరుల సమావేశంలో యూనియన్ రెండవ బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి. శంకర్ నాయక్, కేంద్ర, బ్రాంచ్ కమిటీల నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, వడ్డేపల్లి దాసు, ఎం.డి. అక్రమ్, కె. సత్యనారాయణరెడ్డి, వాసంశెట్టి మార్కండేయ, ఐ.సంపత్ రెడ్డి, కొంగర రవీందర్, ఆకుల రాజిరెడ్డి, గజ్జి ఓదెలు, కొల కనకయ్య, చల్ల శ్రీనివాస్, శేషికుమార్, అబ్బిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని వేధించిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు బైఠాయించిన బిజెపి నాయకులు
- బీజేపి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో చీకురాయి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న అమర్ నాథ్ అనే విద్యార్థిని హనుమాన్ దీక్ష మాల వేసుకుని పాఠశాలకు వస్తే సదరు పాఠశాల యాజమాన్యం విద్యార్థిని బయట ఎండలోనే నిలుచోబెట్టి, పాఠశాలకు రావద్దని శారీరకంగా, మానసికంగా వేధించిన సెయింట్ అన్స్ స్కూల్ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెట్టాలని బీజేపి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో హనుమాన్ మాల ధరించిన 9వ తరగతి విద్యార్థిని వేధించిన సంఘటనపై బీజేపీ కార్యకర్తలు హనుమాన్ దీక్షాపరులతో కలిసి పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టేంవరకు ఇక్కడి నుండి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు.. పెద్దపల్లి సీఐ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఆందోళనకారులను విరమింపచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డి మాట్లాడుతూ అందరినీ సమానంగా చూడాల్సిన పాఠశాల నిర్వాహకులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ ఎందుకు కాషాయ బట్టలు వేసుకున్నావు, ఇలా మాల ధరిస్తే పాఠశాలకు రావాల్సిన అవసరం లేదంటూ పరుష పదజాలంతో దూషించడం, మానసికంగా వేధించడం లాంటి మూర?పు చర్యలకు సదరు పాఠశాల యాజమాన్యం పాల్పడడాన్ని భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కుల



మతాలకు, వర్గాలకు అతీతంగా పాఠశాలను నిర్వహించాల్సిన యాజమాన్యం విద్యావ్యవస్థలో మత విద్వేషాలు నింపుతూ, పసి మనసుల్లో రాగద్వేషాలను నింపేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే పోలీసులు పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన కేసులు పెట్టి, ప్రిన్సిపాల్ ని అరెస్ట్ చేయాలని డిమాండ్ సంజీవరెడ్డి డిమాండ్ చేశారు.ఈ ఆందోళన కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె సదానందం, కడారి అశోక్ రావు, అమరగాని ప్రదీప్ కుమార్, శివంగారి సతీష్, పర్శ సమ్మయ్య, జంగాచక్రధర్ రెడ్డి, బెజ్జంకి దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలి

◆ భవిష్యత్తులో చదువుకునే కోర్సులపై మార్గదర్శకం ◆ మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం

**శామీర్ పేట, మార్చ్ 25 (ది క్రైమ్ న్యూస్) :** కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణమని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇదే స్పూర్తితో చదువుకోవాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం విద్యార్థులకు బోధించారు. మంగళ వారం కూకట్ పల్లి మండలంలోని బృందావన్ కాలనీలో కుత్బుల్లాపూర్ కు నిర్వహిస్తున్న తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జానియర్ కాలేజీని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తనిఖీ చేసారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని కలెక్టర్ గౌతం విద్యార్థులకు సూచించారు. పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో కలెక్టరు ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. భోజన శాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టరు సూచించారు. స్టోర్ రూం లోని వంట సామాగ్రిని పరిశీలించి తడి తగలకుండా నిలువ చేయాలన్నారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ మార్కులను సాధించే విద్యార్థులకు భవిష్యత్తులో చదువుకునే కోర్సులపై మార్గదర్శకం అందిస్తూ వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ను అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పాఠశాల భవనానికి చెల్లించే అద్దెలో 5 శాతం మినహాయించి అవసరమైన చిన్న చిన్న మరమ్మత్తులను చేయించుకోవాలని ప్రిన్సిపల్ కు సూచించారు. అనంతరం ప్రక్కనే నిర్వహిస్తున్న బాలానగర్ తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జానియర్ కాలేజీని కూడా కలెక్టరు సందర్శించారు. అక్కడ కూడా విద్యార్థులతో మాట్లాడి వారికి మిగిలిన పరీక్షలు కూడా బాగా వ్రాయాలని మంచి మార్కులు సాధించాలని కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈఓ కాంతమ్మ, కూకట్ పల్లి తహసీల్దారు స్వామి, కాలేజీ ప్రిన్సిపల్ మాధవిలత, తదితరులు పాల్గొన్నారు.





# ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పొడగించాలి

**- రియల్ఎస్టేట్ సంఘం జిల్లాధ్యక్షుడు రమేష్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఫీజు చెల్లింపు గడువును మరో నెల రోజులు పొడిగించాలని రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎరుకల రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పాత్రికేయులతో రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని తాము స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించబడిన ప్లాట్లలో గృహ నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం అవుతుందని, అలాగే నిర్మాణ అనుమతి ఫీజులో కొంత రాయితీ కూడా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అయితే, మార్చి 31తో గడువు ముగుస్తుండటంతో, ఆన్లైన్ సర్వర్ సమస్యలు, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, మునిసిపాలిటీల నుండి అనుమతుల జాప్యం కారణంగా చాలామంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించడంలో ఇబ్బందులు పడుతున్నారని రమేష్ తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం గడువును పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ అధికారులు కూడా ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆయన కోరారు. ఎల్ఆర్ఎస్ పథకం అందరికీ అందుబాటులోకి వచ్చేలా చూడాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు.

# అంత్యక్రియలకు ఆర్థికసాయం



**కూకట్ పల్లి మార్చ్ 25 (ది క్రైమ్ న్యూస్):** కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని గురుగోవింద్ సింగ్ నగర్లో నివసించే జంగు సింగ్(65) అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

# గ్యారంటీల గారడితో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆరు గ్యారంటీలు అమలు చేయాలి - పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- జిల్లా కేంద్రంలోని కునారం పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి
- సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రజలను గ్యారంటీల గారడితో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ పర్యటన సందర్భంగా పెద్దపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ర్యాలీ అనంతరం పెద్దపల్లి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఆనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యలపై సర్వేలు చేయడం జరుగుతుందని ఆ సర్వేల ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఒక బస్సు ప్రయాణం తప్ప మిగతావి ఏవి అమలు జరగలేదని అన్నారు. మహిళలకు 2500 ఇస్తామన్నది అమలు జరగలేదు,వ్యవసాయ కూలీలకు 12000 ఇస్తామని ఇవ్వలేదని, ఎస్సీ ఎస్టీలకు 12 లక్షల ఇస్తామన్నది అమలు జరగలేదని అన్నారు. రైతుబంధు, పంట రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలు ఇండ్లు ఇళ్ల స్థలాలు లేని వాళ్ళు ఉన్నారని, వాళ్లందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా చెప్పింది కానీ ఇప్పటివరకు ఎవరికీ కూడా ఇండ్లు ఇవ్వలేదని అన్నారు. రెండు సంవత్సరాలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పేదలను గుర్తించి భూ పోరాటం చేయడం జరుగుతోందని అన్నారు. గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి 500000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గల కూనారం రైల్వే బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, జిల్లాలో పంట నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు పెంచకుండా మోసం చేసిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ఈ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలకు పూనుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, రాష్ట్ర నాయకులు బిక్షమయ్య, కోట రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు, జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్, సీపెల్లి రవీందర్,జి జ్యోతి, మండల కమిటీ సభ్యులు మోదంపల్లి శ్రావణ్,జిల్లాల ప్రశాంత్,సీపెల్లి దిలీప్,నవీన్,వెంకటస్వామి, ఖాజా, రాజమలు,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకై కృషి చేద్దాం: బండి రమేష్





**కూకట్ పల్లి మార్చ్ 25 (ది క్రైమ్ న్యూస్):** దేశ ప్రగతి, ప్రజల అభ్యున్నతి కోసం తపించిన బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకై కృషి చేద్దామని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ దయార్ గూడ లోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి సింగూర్ పాండు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న షెడ్ కు శంకుస్థాపన కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ లతో పాటు పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు. ఈ సందర్భంగా షెడ్ ఏర్పాటుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని వారికి తెలిపారు. కార్యక్రమంలో దయార్ గుడా అంబేద్కర్ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే ఐజేయు మూడవ మహాసభ సన్నాహక సమావేశం



**ధర్మపురి, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయు 3వ మహాసభ సన్నాహక సమావేశంను నిర్వహించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె. సురేంద్ర కుమార్ తెలిపారు. టీయూడబ్ల్యూజే ఐజేయు జగిత్యాల జిల్లాశాఖకు త్వరలో జరగబోయే మూడవ మహాసభకు సంబంధించిన సన్నాహక సమావేశంను జగిత్యాల జిల్లా కేంద్రం లోని ప్రెస్ క్లబ్ సొంత భవనంలో మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిన జె. సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నికల కార్యాచరణ, నిర్వహణకు సంబంధించిన ఆహ్వాన కమిటీని వారు నియమించారు. ఈ కమిటీలో జాతీయ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు 9 మంది ప్రధాన పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు ఈ కమిటీలో సభ్యులు గా ఉంటారని సురేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకుల వారి అనుకూల సమయం కేటాయించడం గురించి జిల్లా నాయకత్వం వారిని సంప్రదించి మహాసభ తేదీని ఖరారు చేయుటకు ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీటీ శ్రీనివాసరావు, ఏ.ప్రదీప్ కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి ఇమ్రాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, నక్క లక్ష్మణ్ యాదవ్ లతోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల కు చెందిన ప్రెస్ క్లబ్ బాధ్యులు, జిల్లాలోని స్టాఫ్ రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# జూలపల్లిలో పారిశుధ్య పనుల డిఎల్ఓ సతీష్.పరిశీలన..!



**కమాన్ పూర్, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను, శ్రీరామ్ నగర్ లోని పైప్ లైన్ లీకేజ్ పనులను మంథని డిఎల్పీవో సతీష్ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్ కు తగు సూచనలు చేశారు. రోడ్ల పైన చెత్త వేస్తే వారికి ఫైన్ విధించమని ఆదేశాలు జారీ చేశారు.

# న్యాయవాదుల విధుల బహిష్కరణ



**లక్షెట్టిపేట,మార్చి 25 (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్లో న్యాయవాది ఇజ్రాయెల్ ఎర్ర బాబు హత్యకు నిరసనగా మంగళవారం స్థానిక న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గడికొప్పుల కిరణ్ మాట్లాడుతూ న్యాయవాదిని హత్య చేయడం హేయమైన చర్య అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణకు వెంటనే ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకే రక్షణ లేనప్పుడు సామాన్యులకు ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను చూస్తుంటే న్యాయ వ్యవస్థ ఉనికికే ప్రమాదంగా మారనున్నదన్నారు. ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బార్ అసోసియేషన్ తెలిపింది. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు గాండ్ల సత్యనారాయణ, రాజేశ్వర్ రావు, భూమ్ రెడ్డి, కోమిరెడ్డి సత్తన్న,కారుకూరి సురేందర్,గోవిందా రావు, గుండారపు పద్మ, ప్రదీప్, మల్లికార్జున్, రెడ్డిమల్ల ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు రూ.5 వేలు అందజేసిన మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీ రావు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్) మార్చి 25:** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామం లో మంగళవారం ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు జరిగాయి. గౌడ కులస్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. దేవాలయం లో తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు పూజలు చేశారు. రూ. 5 వేల నగదును ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముక్కెర ఓదెలుకు అందించారు. గ్రామ పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు పూజలు నిర్వహించారు. పంబాల పూజారులు ఓరం స్వామి, ఓరం అఖిల్ లు పట్నం వేశారు. మహిళలు డప్పులతో బోనాలు ఎత్తుకొని దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జంగేటి కుమార్, పబ్బ మొగిలి, దాసరి రాములు, దాసరి వెంకన్న, కేక్కర్ల సమ్మయ్య, కెక్కర్ల వెంకన్న, కెక్కర్ల మోహన్, ముక్కెర కిష్ట స్వామి,ముక్కెర సారథి, ముక్కెర శంకర్, కెక్కార్ల చిన్న వెంకన్న, ముక్కెర మోహన్, ముక్కెర చిన్న, గుమ్మడి ప్రసాద్, మోత్కూరి శ్రీనివాస్, కెక్కర్ల నగేష్, కెక్కర్ల చిన్న సమ్మయ్య, పబ్బ సది,ముక్కెర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టియూసి బ్రాంచ్ కమిటీ సభ్యుల పరిచయం



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య తో మంగళవారం ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియూసి బ్రాంచ్ కమిటీ సభ్యుల పరిచయం జరిగింది. ఉదయం డివిజన్ కార్యాలయానికి, యూనియన్ రెండవ బ్రాంచ్ కమిటీ సభ్యులను వెంట తీసుకు వచన యూనియన్ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ జీఎం ను కలిసి కమిటీ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్ నాయకులు నేడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను అన్నింటిని గంప గుత్తగా కార్పొరేట్ స్థాయి పెత్తందారులకు కట్టబెట్టడానికి ప్రధాని మోడీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజలకు ఉపాధి కల్పించడానికి ఉన్నాయి తప్పా కార్పొరేట్ల జేబులు నింపడానికి కాదంటూ ఆయన మండిపడ్డారు. ఈ పరిచయ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, ఉప ప్రధాన కార్యదర్శి ఎండి.అక్రమ్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి ఐ. సంపత్ రెడ్డి, కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సాలిగామ మల్లేష్, నవీన్, నూతనంగా ఎంపికైన బ్రాంచ్ కమిటీ కార్యదర్శులు ఇ. మల్లికార్జున్, ఆకుల రాజయ్య, టి.సమ్మయ్య, బర్ల రవీందర్, అవినాశ్, ప్రణయ్ భాస్కర్, సహాయ కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, స్పెషల్ ఇన్వెంట్ మెంబర్లు, డెలిగేట్లు పాల్గొన్నారు.

## అవార్డ్ గ్రహీతలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సన్మానం

**- సేవా నిరతికి దక్కిన గౌరవం మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, మాజీ తాజా ఉపసర్పంచ్ సాయికుమార్**



**కమాన్ పూర్, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** బిట్.బిట్.డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రోజున గోదావరిఖని లో జరిగిన ఉగాది పురస్కారాలలో భాగంగా వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి అవార్డుల ప్రాధానోత్సం జరిగింది. ఈ అవార్డులో భాగంగా కమాన్ పూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు గారికి సేవా రత్నా, జూలపల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ పోలు దాసరి సాయికుమార్ గారికి యువకిశోరం అవార్డులు రాగా వారిని సోమవారం స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ బిట్.బిట్.డాన్స్ అకాడమీ ఉగాది పురస్కారాల సందర్భంగా అవార్డు ఎంపిక చేసి అవార్డ్ ప్రధానం చేయడం సంతోషకరంగా ఉందని ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ కన్వీనర్ తాటికొండ శంకర్, బి.ఆర్.ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్, నాయకులు నీలం శ్రీనివాస్, ఎలబోయిన రామ్మూర్తి, మట్ట శంకర్, తోట రాజ్ కుమార్, అనవేన దేవేందర్, సాన సురేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను నిరాశిస్తూ.. ఆశ కార్యకర్తల రాస్తారోకో



**కమాన్ పూర్, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమస్తున్న ఆశ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరాశిస్తూ కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆశ కాసర్యకర్తలకు రూ, 18 వేల చొప్పున వేతనం చెల్లిస్తామని హామిని ఇచ్చి ఏడాదికి పైగా కాలం గడిచిన ఇంకా హామిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇచ్చినా హామిని ఆమెకు చేయాలని డిమాండ్ చేస్తే ఆశ వర్కర్లను అక్రమంగా అరెస్టులు చేయడంఎంతవరకుసమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామిని ఆచరణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు వెంగళి అమృత, బర్ల రమాదేవి, దేవి మల్లేశ్వరి, తనుకుల విజయ, గొట్టే రాజెశ్వరి, శిలారపు కల్యాణి బేద కృష్ణవేణి, బంక శ్యామల, పంతకాని పుష్పలత, మేకలగౌతమి, చిప్పకూర్తి స్వరూప, బర్ల స్వప్నలు పాల్గొన్నారు.

## గుండారం గ్రామపంచాయతీలో అకస్మిక తనిఖీలు



**కమాన్ పూర్, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** మంగళవారం రోజున కొమ్మర సతీష్ కుమార్ డివిజన్ పంచాయతీ అధికారి మంథని గారు కమాన్ పూర్ మండలంలో గుండారం గ్రామ పంచాయతీలో అకస్మిక సందర్శన సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించి తగు సూచనలు జారీ చేయడం జరిగినది మరియు గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి , తదుపరి 2024-25 సంవత్సరము ఇంటి పన్నులు తేది:26/03/2025 రోజు వరకు 100% వసూళ్లు చేయవలసినదిగా ఆదేశించినైనది మరియు దరఖాస్తులు మొత్తం (20) ఉన్నందున ఈరోజు వరకు (7) దరఖాస్తు దారులు ఫీజు చెల్లించడం జరిగినది, మిగతా (13)దరఖాస్తు దారులను తేది:31/03/2025 రోజు వరకు ఫీజు చెల్లించే విధంగా ఇంటింటికి వెళ్లి సూచించవలసినదిగా ఆదేశించినైనది. మరియు ధరకాస్తూ దారుడైన శ్రీ అరిశే ఎల్లయ్య గారికి సూచించడం జరిగినది. వీరి వెంట మండల పంచాయతీ అధికారి కమాన్ పూర్ మరియు పంచాయతీ కార్యదర్శి పాల్గొనడం జరిగినది.

## న్యాయవాదుల కోర్టు బహిష్కరణ..




**హుజురబాద్ మార్చి 25 (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ చెందిన న్యాయవాది ఇజ్రాయిల్ పై పాశవికంగా దాడి చేసి హత్య చేసిన హంతకున్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ హుజురాబాద్ బార్ అసోసియషన్ అధ్యక్షులు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై జరిగే దాడులను అరికట్టేందుకు న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, ఉపాధ్యక్షులు బండి రమేష్, న్యాయవాదులు భగవాన్ రెడ్డి విజయా రెడ్డి, ముక్కెర రాజు, లక్ష్మణ మూర్తి,శ్రీధర్ బా బు, బత్తుల తిరుపతి,విక్రం, ముచ్చ దివ్య, భానుకిరణ్, హరికిషన్, రాజేష్, అనిల్, రవి, కళ్యాణ్, శ్రవణ్, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టబద్ధంగా మంచి పని చేసినప్పుడు తప్పక గుర్తింపు

**● గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థ ● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ప్రతి ఒక్క పోలీస్ అధికారి చట్టబద్ధంగా పనిచేయాలని, మంచిగా పని చేసినప్పుడు తప్పుక గుర్తింపు వస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. నెలవారి సమీక్షలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపిలు, అడిషనల్ డిసిపి అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజినల్, జోన్లవారిగా పెండిరగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్షీట్కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోద్కెన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతోపాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్ష జరిపారు. అదేవిధంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం ఉండాలని, ప్రతి కేసులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కేసులలో న్యాయపరంగా, పారదర్శకంగా విచారణ జరపాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో అధికారులకు, సిబ్బందికి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని రకాల సమాచారంపై అవగాహన ఉండాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని, సిసి కెమెరాలు జరిగే విషయాలను గుర్తించడం జరుగుతుందని, అదే ప్రజలతో మంచి సత్సంబంధాలను కొనసాగిస్తే బయట చర్చ జరిగే ప్రతి ముందస్తు సమాచారం తెలుస్తుందని అన్నారు. దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, ప్రధాన చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతోపాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఒక రెండు గంటలపాటు పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారులకు, బాధితులకు కేటాయించాలని, రెండు గంటలు పెండిరగ్ కేసులను సమీక్షా జరపాలని, ఏద్కెనా సంఘటన జరిగినప్పుడు, బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు సంఘటన స్థలానికి తప్పనిసరిగా వెళ్ళాలని, అప్పుడు క్షేత్రస్థాయిలో సమాచారం లభిస్తుందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో విలేజ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని, కిందిస్థాయి సిబ్బందితో మర్యాదగా ఏలాంటి భేదాలు లేకుండా ప్రవర్తించాలని, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రవాణా చేసే వారిని గుర్తించాలని, కేసులు నమోదు చేయాలని, గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్బంగా గంజాయి స్వాధీనం కేసులలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్, పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, పెద్దపల్లి ఎసిపి జి.కృష్ణ, ట్రాఫిక్ ఎసిపి నరసింహులు, ఎసిపి మల్లారెడ్డి, ఎఆర్ ఎసిపి ప్రతాప్, ఎఓ శ్రీనివాస్, సిఐలు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఏడు రోజుల ముందుగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఆర్.జీ-త్రీ ఏరియా

**● రామగుండం-త్రీ జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు**





**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 25:** రామగుండం-త్రీ ఏరియాకు నిర్దేశించిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను రామగుండం-త్రీ ఏరియా అధికారులకు, ఉద్యోగులకు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అభినందనలు తెలియజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం రామగుండం-త్రీ ఏరియా కు నిర్దేశించిన 62.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 100 శాతం అనగా 62.5003 లక్షల టన్నుల బొగ్గును ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఏడు రోజుల ముందుగానే ఉత్పత్తి చేసినందుకు సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థకు అద్భుతమైన నాయకత్వం అందించడమే కాకుండా, క్షేత్ర స్థాయి పర్యటనలతో ఉద్యోగులందరిలో చైతన్యం కలిగిస్తూ, ప్రోత్సాహాన్ని నింపుతూ చక్కని మార్గదర్శకత్వం అందిస్తున్న సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ కి, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్న డైరెక్టర్ (ఇ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్లానింగ్, ప్రాజెక్ట్స్ అండ్ పా) కొప్పుల వెంకటేశ్వర్లు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సంస్థలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులకు, కార్మిక సంఘాల నాయకులకు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు, కాంట్రాక్టర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు, పాత్రికేయులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా ఈ లక్ష్య సాధనలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు కోరారు.

# డంపింగ్ యార్డ్ను పరిశీలించిన ఆర్డీవో..





**జమ్మికుంట మార్చి 25 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 274,75,76 గల నెంబర్ లలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు నివేషణ స్థలాలు కేటాయించారు. ఇట్టి స్థలంలో స్తోమతగల వారు ఇళ్ళను నిర్మాణం చేపట్టారు. ఇట్టి స్థలాలను తిరిగి ప్రభుత్వం డంపింగ్ యార్డ్ కు అనుమతించడంతో మునిసిపల్ వారు నిరుపేద నీవేషణ స్థలాలలో డంపింగ్ యార్డ్ గా మార్చుకొని చెత్తను వేయడం జరుగుతుంది. సదరు బాధితులు గత సంవత్సరం నుండి మున్సిపల్ కార్యాలయం చుట్టూ, ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమకు కేటాయించిన స్థలాలను వారికి ఇవ్వాలని తమ గోడును వెల్లబుచ్చుకుంటున్నారు. ఇందులో భాగంగా బాధితులు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కదిలిన అధికార యంత్రాంగం సర్వేనెంబర్ 274, 75,76 లలో క్షేత్రస్థాయిలో ఆర్డీవో ఎస్ రమేష్ బాబు, విచారణ చేపట్టారు. ఆర్డిఓ పరిశీలనకు వస్తున్నట్టు తెలుసుకున్న సదరు బాధితులు డంపింగ్ యార్డ్ కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్డీవో వద్ద తమ గోడును వెల్లబుచుకున్నారు. దీనిపై ఆర్డిఓ ఎస్ రమేష్ బాబు స్పందిస్తూ ప్రతి ఒక్క బాధితునికి న్యాయం జరిగేలా చర్యలు చేపడుతామని ఇందులో డంపింగ్ యార్డ్ కు ఎంత భూమిని కేటాయించారో మిగతా వాటికి ఎంత స్థలాన్ని కేటాయించారు క్షుణ్ణంగా పరిశీలించి దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెల్లి ప్రతి ఒక్క బాధితుల కు శాశ్వత పరిష్కారం చూపుతామని ఈ సందర్భంగా ఆయనద హామీ ఇచ్చారు. ఆర్డిఓ వెంట జమ్మికుంట ఎమ్మార్వో గట్ల రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, రెవిన్యూ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు మున్సిపల్ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. బాధితులు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైనా స్పందించి డంపింగ్ యార్డ్ ఇక్కడి నుండి తరలించి తమ నివేషణ స్థలాల్లో హద్దులు చూపించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగిశెట్టి వెంకన్న, పిక్కల కమల, ఏ సరిత, కృష్ణవేణి,ఎన్ పద్మ, రాజ్యలక్ష్మి, సతీష్, ఆకుల రాజేందర్, మంద సమ్మయ్య,లతోపాటు సుమారు 100 మంది బాధితులు పాల్గొన్నారు.

# సంక్షేమాధికారులతో సమీక్షా సమావేశం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 25:** రామగుండం-త్రీ ఏరియాలోని వివిధ గనులు, విభాగాల సంక్షేమాధికారులతో పాటు ఏరియా పర్సనల్ విభాగం అధికారులతో మంగళవారం జి.యం. కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు హాజరై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ముందుగా గనుల సంక్షేమాధికారులు సంబంధిత గనులు, విభాగాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పన, పదోన్నతులు, క్రమశిక్షణాచర్యలు లాంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు అందించారు. తదుపరి జి.యం. మాట్లాడుతూ సంక్షేమానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే తగినచర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పనలో జాప్యం కాకుండా చూడాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగులకు అమలు చేస్తున్న వైద్యసేవల పథకానికి సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు అవగాహన కల్పించి దరఖాస్తులు అందజేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల సంక్షేమాధికారులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. గ్రాట్యుటీ, సి.ఎం.పి.ఎఫ్. నామినేషన్ పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు అవగాహన కల్పించి హెచ్.డి.ఎఫ్.సి., పంజాబ్ నేషనల్ బ్యాంకులలో వారి వేతన ఖాతాలు తెరిచే విధంగా కృషి చేయాలని కోరారు. ఉద్యోగుల సర్వీసు విషయాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం గనులు, విభాగాలలో టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పనలో పెండింగ్ లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటున్న సంక్షేమాధికారులు, ఏరియా పర్సనల్ విభాగం అధికారులను జి.యం. ఈ సందర్భంగా ప్రశంసించారు.ఈ సమావేశంలో గనుల ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకటరమణ, జె.రాజశేఖర్, మేనేజర్లు ఉదయ్ హరిజన్, కె.వి.రామారావు, పి.సుధాకర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ షబ్బీరుద్దీన్, అధికారులు గుర్రం శ్రీహరి, వి.సునీల్ ప్రసాద్, యం.డి.మతీన్ హుస్సేన్, పి.రాజేశం, బి.మురళి, సాయికృష్ణ , ప్రీతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో విధుల బహిష్కరించిన న్యాయవాదులు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 25:** హైదరాబాదులో న్యాయవాది ఇజ్రాయిల్ ను దారుణంగా హత్య చేసిన సంఘటనపై నిరసన తెలుపుతూ మంథనిలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపు మేరకు మంథనిలో న్యాయవాదులు అందరూ కలిసి ఇజ్రాయిల్ మృతికి సంతాపం తెలుపుతూ విధులను బహిష్కరించామని తెలిపారు. న్యాయవాదులపై దాడులు జరగడంతో పాటు హత్యలకు పాల్పడుతున్నారని న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తూ మంథని న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘౌత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్ రెడ్డి, కోశాధికారి ఆంజనేయులు, న్యాయవాదులు శశికాంత్ కాచే, రమేష్ బాబు, భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, శశిభూషణ్ కాచే, జంజర్ల శేఖర్, ఆర్ల నాగరాజు, సుభాష్, శ్రీనివాస్, వెంకటరామ్ రెడ్డి రాచర్ల రాజేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని యువతని హాస్పిటల్‌కి తరలించిన శిశు సంక్షేమ శాఖ ఎఫ్ఆర్ఓ స్వర్ణలత





**పెద్దపల్లి, (ది క్రైమ్ న్యూస్):** ఈ రోజు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత కొద్దీ రోజుల క్రితం పెద్దపల్లి కమాన్ దగ్గర మతి స్థిమితం లేని యువతీ దిక్కుతోచని స్థితిలో ఉందని సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకొని, అక్కడ చుట్టూ ప్రక్కన వారిని ఆమె వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించగా ఆమె వారం రోజుల నుండి ఫంక్షన్ దగ్గర ఉంటుందని తాను ఎక్కడి నుండి వచ్చిందో కుడా తెలీదని చెప్పడంతో వెంటనే ఆమె ని హైదరాబాద్ లో గల చోటుప్పల్ దగ్గర అమ్మ నాన్న ఆశ్రమానికి సఖి సిబ్బంది సహకారంతో తరలించడం జరిగింది. ఇందులో సఖి స్వప్న, సూపరింటెండెంట్ రాజయ్య, స్వర్ణలత, పోలీస్ సిబ్బంది, సఖి కవిత తదితరులు ఉన్నారు.

## అయోధ్య రామ మందిర అక్షింతలపై, హిందూ సమాజంపై వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలి

**- బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనులతోనే రెండోసారి ఎంపీగా గెలుపొంది కేంద్ర మంత్రి అయ్యారు**

**- బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్**



**కరీంనగర్ టౌన్, మార్చ్ 25(ది క్రైమ్ న్యూస్):** బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు వి ఆర్ ఎస్ ఇచ్చి గద్దె దించిన ఇంకా ఆ పార్టీ నేతలకు బుద్ధి రావడం లేదని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్ విమర్శించారు కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ కరీంనగర్లో నిర్వహించిన సన్నాహక సమావేశం లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బిజెపి పై, కేంద్ర మంత్రి బండి సంజయ్, అయోధ్య రామ మందిర అక్షింతలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ ప్రతి సారి హిందువుల మనోబాలు దెబ్బతినేలా వాక్యలు చేయడం బాధాకరమన్నారు.కేటీఆర్ అయోధ్య నుండి వచ్చినవి అక్షింతలు కావు., రేషన్ బియ్యం తెచ్చి అక్షింతల పేరుతో పంచి ప్రజలను మోసం చేశారని వాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం, మద్దతు కోసం యావత్తు హిందు సమాజాన్ని కించ పరిచేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. కేటీఆర్ మీ వ్యాఖ్యలను హిందూ సమాజం గమనిస్తుందని హిందువుల మనోబాలను కించ పరుస్తే మీ పార్టీకి పుట్టగతులు ఉండవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎన్నికల్లో తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ బిఆర్ఎస్ నాయకుల తీరు మారడం లేదన్నారు. జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అడ్రస్ లేకపోకుండా పోయిందని, అలాంటి పార్టీ నేతలు బిజెపిపై, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై అనవసర వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన అభివృద్ధి గురించి టిఆర్ఎస్ నేతలకు తెలియకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో చాలాఅభివృద్ధి పనులు దిగ్విజయంగా కొనసాగు తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో కరీంనగర్ అభివృద్ధి కోసం నిధులు తెచ్చిన ఘనత బండి సంజయ్ కుమార్ కె దక్కుతుందన్నారు. పెద్ద ఎత్తున స్మార్ట్ సిటీ నిధులు వందల కోట్లు తెచ్చి కరీంనగర్ నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేసిన ఘనత బండి సంజయ్ కుమార్ కె దక్కుతుందన్నారు. నగరంలో ప్రజలు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్యలు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ సమస్యలు, నేషనల్ హైవేలు, గ్రామాల్లో అంతర్గత రహదారులు,ఇలా అనేక సమస్యలకు పరిష్కారం చూపిన నాయకులు బండి సంజయ్ అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ కు చేసిన అభివృద్ధిపై ఆత్మ విమర్శన చేసుకోవాలన్నారు. కరీంనగర్ నగరానికి కేబుల్ బ్రిడ్జ్ అని తెచ్చి., వేసిన రోడ్లు లేచి పోయి బిగించిన లైట్లు రాకుండ కళావిహీనంగా తయారు చేశారన్నారు.మానేరు రివర్ ఫ్రంట్ అతి గతి లేకుండా పోయిందని విమర్శించారు. బిఆర్ఎస్ వందల కోట్ల రూపాయలతో, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై చేపట్టిన నాసిరకం పనులు సజీవ సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఇది మీ బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.బండి సంజయ్ హాయాంలో నగరంలో జరిగిన రోడ్లు, లైట్లు, పార్కులు, త్రాగు నీరు, లాంటి అభివృద్ధి పనులు ప్రజలకు కనిపిస్తు న్నాయన్నారు. ప్రజలకు అంతా తెలుసు ఎవరు ఏం చేస్తున్నారో అన్ని విషయాలు గమనించే బండి సంజయ్ కుమార్ ను పార్లమెంటు ఎన్నికల్లో రెండోసారి భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఆ గెలుపే ఆయన చేసిన అభివృద్ధి కి నిదర్శనమ్మన్నారు.ఇవన్ని తెలిసి మోడి నాయకత్వం, భారతీయ జనతా పార్టీని కేటీఆర్, బిఆర్ఎస్ నేతలు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. భారతీయజనతాపార్టీని, నాయకులను చులకన చేసి మాట్లాడం మానుకోవాలని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. భారతీయ జనతాపార్టీ నాయకత్వాన్ని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ప్రజలంతా ఒక్కటయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# పల్లె దవాఖానాను కలెక్టర్ తనిఖీ..

- ప్రజలకు వైద్య సేవలందించేందుకు మెడికల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఉండాలని..
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం

**శామీర్ పేట, మార్చ్ 25 (ది క్రైమ్ న్యూస్):** పల్లె దవాఖానాలలో ఒపి పెషంట్ల సంఖ్యను పెంచేలా పల్లె దవఖానాలో అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. మంగళవారం కూకట్ పల్లి మండలంలోని హౌజింగ్ బోర్డు 4వ ఫేజ్ లో గల పల్లె దవాఖానాను కలెక్టర్ తనిఖీ చేసి ప్రజలకు వైద్య సేవలందించేందుకు మెడికల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఉండాలని, పల్లెదవఖానాలో వెంటనే మెడికల్ ఆఫీసర్లను నియమించాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ను కలెక్టరు ఆదేశించారు. పల్లె దవాఖానాను పరిశీలించి రోజుకు ఎంత మంది ఓపి పెషంట్లు వస్తారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒపి పేషంట్ల సంఖ్యను పెంచేలా పల్లె దవాఖానా అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టరు ఆదేశించారు. పల్లె దవాఖానాలో ఎంత మంది సిబ్బంది ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పల్లె దవఖానాలలో అందించే వైద్య సేవల రికార్డుల గురించి అడిగి రిజిష్టర్లను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ గురించి అడిగి వాటి నమోదు రిజిష్టర్లను తనిఖీ చేసారు. రోజుకు ఎంత మంది రక్తపరీక్షలకు నమూనాలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించి మందుల నమోదు రిజిష్టర్లను, పేషంట్లకు మందులు అందించిన రిజిష్టర్లను తనిఖీ చేసి గత నాలుగు నెలలుగా పేషంట్లకు మందులు ఇచ్చిన రికార్డుల నమోదు సరిగా లేదని కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం కలెక్టర్ కూకట్ పల్లి లోని బాలాజీ నగర్ బస్తీ దవాఖానా ను తనిఖీ చేసి, అక్కడ ఉన్న వైద్య సిబ్బంది ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పేషంట్లకు అందించే సేవలను మెరుగు పరిచి మరింత విస్తృతం చేయాలని వైద్యులకు సూచించారుఆసుపత్రిని తనిఖీ చేస్తూ ల్యాబ్ రిజిస్టర్లను,రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రత్యేక విభాగానికి సంబంధించిన వ్యాధితో వచ్చే పేషెంట్లకు ఏవిధంగా ట్రీట్మెంట్ ఇస్తున్నారని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ఏవిధంగా టెలిమెడిసిన్ అందిస్తున్నారని కంప్యూటర్లో పరిశీలించారు. ప్రతిరోజు ఒపి పేషంట్ల నమోదును, వారికి అందించే వైద్య సేవల వివరాలను ట్యాబ్ లో పరిశీలించి, ప్రతిరోజు తనకు నివేదికలు పంపాలని కలెక్టరు డిఎంఅండ్ హెచ్ఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరీ, కూకట్ పల్లి తహసీల్దారు స్వామి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- **కొత్త కిషోర్ కుమార్**





**లక్షెట్టిపేట, మార్చి 25 (ది క్రైమ్ న్యూస్):** చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలకు రుణం తీర్చుకోవడం తన అదృష్టమని అప్పటి యుపిఎస్ ఇప్పటి జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థి కొత్త కిషోర్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో తను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు లేవని పాఠశాల హెచ్ఎం సునంద తన దృష్టికి తేవడంతో వారి తాత కీర్తిశేషులువొజ్జల చంద్రమౌళి జ్ఞాపకార్థం గా 54 వేల రూపాయలతో టేబుల్లు, బీరువాలు, బ్లాక్ బోర్డులు అందించారు. ఈ సందర్భంగా కొత్త కిషోర్ కుమార్ మాట్లాడుతూ ..... తాను ఈ పాఠశాలలో చదువుకొని జెపి మోర్గాన్లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్నానని తన చిన్ననాటి పాఠశాలలో సౌకర్యాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కొంత మంది విద్యార్థులతో మాట్లాడిన ఆయన వారి అభిరుచులను కనుక్కొని తన సహ విద్యార్థులతో చర్చించి మరింత సహాయం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇద్దరు విద్యార్థుల తో మాట్లాడిన అనంతరం వారు టెన్త్ క్లాస్ లో 10 జీపీఏ పొందుతామని హామీ ఇవ్వడంతో వారికి తగిన బహుమతి ఇస్తానని ఈ వాగ్దానం చేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం సునంద మాట్లాడుతూ.. ఎప్పుడో చదువుకున్న ఇప్పటివరకు గుర్తుంచుకొని విద్యార్థుల కోసం పలు వస్తువులు అందించడం ఆనందం కలిగించే విషయం అన్నారు. కిషోర్ కుమార్ ను ఆదర్శంగా తీసుకొని మరింత మంది పూర్వ విద్యార్థులు పాఠశాలకు సాయం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలన్నారు. గతంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో పాఠశాల సమస్యలు దృష్టికి తేగా కిషోర్ కుమార్ స్పందించి 54 వేల రూపాయలు తాను ఇస్తానని అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోమని చెప్పారన్నారు. అందులోని ప్రతి పైసా విద్యార్థుల అభివృద్ధి కోసం అవసరమయ్యే వస్తువులు కొనుగోలు చేశానన్నారు. ఈ సందర్భంగా దాత కొత్త కిషోర్ కుమార్ కు పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే రవీందర్, సుజాత, మాయ, వసంత, సంపూర్ణ, రామ్మోహన్ రెడ్డి, సరిత, స్వప్న పూర్వ విద్యార్థి బృందం నలినీకాంత్, దిగంబర్, శిరీష్, రమేష్, జగదీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లి మండలాన్ని నూతన మున్సిపాలిటీగా..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు
- మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్





**మూడుచింతలపల్లి, మార్చ్ 25 (ది క్రైమ్ న్యూస్):** న్యూతన మున్సిపాలిటీగా రూపొందిన మూడు చింతలపల్లి మండలం ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలాన్ని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కృషితో నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం చాలా సంతోష కరమైన విషయమని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్ అన్నారు, కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని మరోసారి రుజువు చేశారు. తెలంగాణ ప్రజలకు అనుకూలంగా మండలాలను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. మూడుచింతలపల్లి మండలాన్ని నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న మూడు చింతలపల్లి మండలం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. నూతన మున్సిపాలిటీగా మూడు చింతలపల్లి మండలాన్ని ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మండల వైస్ ఎంపీపీ మంద శ్రీనివాసరెడ్డి, మూడు చింతలపల్లి మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దోసకాయల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాల నరసింహ, బసవా రెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అలుగునూర్‌లో నూతన మహిళా పొదుపు సంఘం



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ లోని గ్రామ పంచాయతీ ఆవరణలో పోరండ్ల మహిళా పొదుపు సమితి ఆధ్వర్యంలో గ్రామ మహిళా పొదుపు సంఘాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు.సంఘ అధ్యక్షురాలుగా చౌదరి దేవేంద్ర, ఉపాధ్యక్షురాలుగా సిరిసిల్ల స్వప్న,పాలక వర్గ సభ్యులుగా గుడిపాటి సరోజ,పుట్ట పద్మ,పల్లె కవిత,చిందం విజయ, పంబల స్వప్న, సింగిరెడ్డి సంధ్య,సింగం సారిక,బుర్ర రాణి,చల్ల స్రవంతి, కూచిపూడి జ్యోతి,ఘనకురాలిగా సిరిసిల్ల రేణుకను సభ్యులు ఎన్నుకుని సంఘానికి శ్రీ భవానీ మహిళా పొదుపు సంఘంగా నామకరణం చేశారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు చౌదరి దేవేంద్ర మాట్లాడుతూ....మరింత మంది సభ్యులను చేర్పించడానికి కృషి చేస్తూ సంఘ అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు. కార్యక్రమంలో పోరండ్ల మహిళా సమితి అధ్యక్షురాలు విజయలక్ష్మి , ఘనకులు హేమలత, శ్రీలత పురుషుల పొదుపు సమితి అధ్యక్షులు గుంటి వెంకటేష్ , శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షులు సిరిసిల్ల అంజయ్య ఉపాధ్యక్షులు చల్ల లక్ష్మణ్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఈ నెల 29న తైబజార్ వేలం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 25:-** తైబజార్, స్లాటర్ హౌస్ 2025- 26 సంవత్సరానికి ఈనెల 29న బహిరంగ వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొను బారు తైబజార్ రూ. 50, 000 స్లాట్ హౌజ్ కు రూ. 10, 000 విలువ గల ఏదైనా బ్యాంకు నుండి కమిషనర్ పురపాలక సంఘం మంథని పేరు మీద డిడి తీసి ఈనెల 28 న సాయంత్రం నాలుగు గంటలు పురపాలక సంఘం కార్యాలయంలో సమర్పించి, వేలంలో పాల్గొనవలెనని ఆయన తెలిపారు. ఇతర నియమ నిబంధనలు విచారణ నిమిత్తం కార్యాలయంలో సంప్రదించగలరని ఆయన తెలిపారు.

## ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



**ఎండపల్లి, మార్చి 25(ది క్రైమ్ న్యూస్ ):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో పి ఎస్ సి ఎస్ , ప్రైవేట్ ఎరువుల దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ ఆకస్మిక తణిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ వివరాలు, గొ డౌన్స్ ని తనిఖీ చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మాట్లాడుతూ...డీలర్స్ తప్పనిసరిగా ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వారానే అమ్మాలని తెలిపారు. రైతులు ఎరువుల కొనుగోలుకు వచ్చినపుడు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కామల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మరెడ్డి పల్లిలో ఉచిత వైద్య శిబిరం

**- ఉచిత పరీక్షలు మందులు పంపిణీ**



**ధర్మారం మార్చి 25 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత పరీక్షలు మందుల పంపిణీ సన్షైన్ మరియు స్టార్ హాస్పిటల్ ద్వారా బొమ్మరెడ్డిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ గాగిరెడ్డి ప్రేమలత - తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ మునీందర్ ఆర్.ఎం.పి గ్రామపంచాయతీ పరిధిలో ఉచితంగా మందులు పంపిణీ బీపీ షుగర్ ఈసీజీ గుండె పరీక్షలు కూడా నిర్వహించడం జరిగింది వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు డాక్టర్ దామోదర్ ఎండి డిఎ డాక్టర్ సాయి కృష్ణ డాక్టర్ ఫౌజియా బేగం వర్షిని మరియు క్యాంపు మేనేజర్ కొత్తూరు రాజేందర్ కోఆర్డినేటర్ క్యాతం సతీష్ మరియు మార్కెటింగ్ ఇంచార్జ్లు బాలు పిఆర్వో తిరుపతి మరియు హాస్పిటల్ బృందం పాల్గొనడం జరిగింది

## ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**- చట్టం తన పని తాను చేస్తుంది: తహసిల్దార్**

**ధర్మారం, మార్చి,25 (ది క్రైమ్ న్యూస్):** ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామములోని సర్వే నెంబరు 273 లో ప్రభుత్వ ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఏం.డి వకీల్ తెలిపారు.చట్టం తన పని తాను చేస్తుంది ఇప్పటి నుండి ఎవరైనా భూ ఆక్రమణ చేయాలని చూస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయి అన్నారు.

స్పోర్ట్స్

# ఇంపాక్ట్ ప్లేయర్ తో స్కోరుపై ప్రభావం లేదు

## ఇంపాక్ట్ ప్లేయర్ నియమంపై ఎంఎస్ ధోని




ఐపీఎల్‌లో 5 సార్లు చెన్నై సూపర్ కింగ్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన ఎంఎస్ ధోని ఇంపాక్ట్ ప్లేయర్ నియమావళిపై ఆసక్తికరమైన కామెంట్స్ చేశాడు. ఈ రూల్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి వివాదాస్పదంగా మారుతోంది. ఇది మ్యాచ్‌లో మజాను తీసుకొస్తుందని కొందరు అభిప్రాయపడుతుంటే... ఇది ఆల్‌రౌండర్లకు నష్టం కలిగిస్తుందని మరికొందరు విమర్శిస్తున్నారు. ధోనీ అభిప్రాయం ప్రకారం, ఐపీఎల్‌లో భారీ స్కోర్లకు ఇంపాక్ట్ ప్లేయర్ కారణంగా కాదు, ఇదంతా ఆటగాళ్ల మానసిక మార్పే కారణమని అని ధోనీ అన్నాడు. ఈ ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తమకు ఎలాంటి ప్రయోజనం కలిగించలేదని తేల్చి చెప్పాడు. తాను ఇంపాక్ట్ ప్లేయర్ అనే భావన కూడా లేదని వివరించారు. జియో-హాట్‌స్టార్‌లో 'ది ఎంఎస్డీ ఎక్స్‌పీరియన్స్'లో మాట్లాడిన ఎంఎస్ ధోని, "ఇంపాక్ట్ ప్లేయర్ నియమం అమలులోకి వచ్చినప్పుడు, ఆ సమయంలో దాని అవసరం లేదని నేను భావించాను. ఈ నియమం కొన్నిసార్లు మాత్రమే హెల్ప్ అవుతుంది. కానీ ఎక్కువగా అలా జరగదు. నేను ఇప్పటికీ వికెట్ కీపింగ్ చేస్తున్నాను కాబట్టి, నేను ఇంపాక్ట్ ప్లేయర్ కాదు. నేను ఫీల్డింగ్‌లో కూడా ఉండాలి" అని అన్నారు. ఐపీఎల్‌లో ఇప్పుడు పెద్ద స్కోర్లు రావడానికి ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ మాత్రమే కారణం దాని ఎంఎస్ ధోని అభిప్రాయపడ్డాడు. ఆయన ఏమన్నారంటే... 'చాలామంది ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ వల్ల ఐపీఎల్‌లో పెద్ద స్కోర్లు వస్తున్నాయని భావిస్తున్నారు. కానీ నా అభిప్రాయం ప్రకారం, ఆటగాళ్ల మానసిక స్థితి, పరిస్థితుల కారణంగా ఇలా జరుగుతోంది. ఒక అదనపు బ్యాట్స్‌మన్ అంత రన్స్ చేయడు, అదనపు బ్యాట్స్‌మన్ ఉన్నందున జట్లకు కాస్త వెసులుబాటు ఉంటుంది. బ్యాట్స్‌మన్లు ఎక్కువగా ఆడుతున్నారు. వారి ఉండటం వల్ల జట్టు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ' అని అన్నారు.ముంబై ఇండియన్స్‌తో ఉన్న పోటీ గురించి అడిగిన ప్రశ్నకు ఆయన, 'బ్యాట్స్‌మన్‌గా నేను అన్ని జట్లపై రన్స్ చేయాలనుకుంటున్నాను. జట్టుకు నా అవసరం ఎలా ఉందో దాని ప్రకారం నేను బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నిస్తాను'అని అన్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ నియమం ప్రకారం, కెప్టెన్ ప్లేయింగ్ 11తో పాటు 5 సబ్‌స్టిట్యూట్ ప్లేయర్లను ఎంచుకుంటాడు. మ్యాచ్ సమయంలో, కెప్టెన్ ప్లేయింగ్ 11 నుంచి ఒక ఆటగాడిని మార్చడానికి సబ్‌స్టిట్యూట్ ప్లేయర్లలో ఒకరిని ప్లేయింగ్ 11లో చేర్చవచ్చు. కెప్టెన్ బౌలర్‌ను తీసి బ్యాట్స్‌మన్‌ను, బ్యాట్స్‌మన్‌ను తీసి బౌలర్‌ను కూడా తీసుకురావచ్చు.

# ఢిల్లీ క్యాపిటల్స్ సంచలన విజయం

### లక్నోపై ఒక వికెట్ తేడాతో ఢిల్లీ విజయం

### మార్ష్ కళ్లు చెదిరే బ్యాటింగ్..

నరాలు తెగే ఉత్కంఠగా విశాఖపట్టణంలో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. విజయంపై ధీమాగా ఉన్న లక్నోను అశుతోష్ చావుదెబ్బ తీశాడు. తన దూకుడు బ్యాటింగ్‌తో ఓటమి ఖరారు అనుకున్న మ్యాచ్ ఒక్కసారిగా తిప్పి పడేశాడు. తీవ్ర ఉత్కంఠ కలిగించిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ సంచలనం చేసింది. మార్ష్ కళ్లు చెదిరే బ్యాటింగ్.. పూరన్ పూనకాలతో బ్యాటింగ్‌లో దుమ్మురేపినా కూడా అవి వృథా అయ్యాయి. లక్నోపై ఒక వికెట్ తేడాతో ఢిల్లీ విజయం సాధించి అబ్బురపరిచింది.విశాఖపట్టణంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ 30 బంతుల్లో 75 స్కోర్ అత్యంత వేగంగా పరుగులు రాబట్టగా.. మిచెల్ మార్ష్ అదే స్థాయిలో 36 బంతుల్లో 72 పరుగులు చేశాడు. వీరిద్దరూ కలిసి ఒకదశలో జట్టుకు భారీ స్కోర్ అందిస్తారని అందరూ భావించారు. మెగా వేలంలో అత్యధిక ధరతో రికార్డులు తిరగరాసిన రిషబ్ పంత్ డకౌట్ కావడం అందరినీ షాక్‌కు గురి చేసింది. డేవిడ్ మిల్లర (27), మర్‌క్రమ్ (15) కొంత పరుగులు జోడించారు. భారీగా పారుతున్న లక్నో పరుగులకు ఢిల్లీ బౌలర్లు కళ్లెం వేశారు. మిచెల్ స్టార్ 3 వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టాడు. ముకేశ్ కుమార్ ఒక వికెట్ తీయగా.. అరంగేట్ర బౌలర్ విప్రజ్ నిగమ్ ఒక వికెట్ తీయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కెప్టెన్ అక్షర్ పటేల్ ఒక వికెట్ కూడా తీయలేదు.





# ఫస్ట్ మ్యాచ్‌లోనే అదరగొట్టిన విప్రాజ్

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ కుర్రాడు విప్రాజ్ నిగమ్ ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో కీలకమైన మార్‌క్రమ్ వికెట్ తీయడం సహా బ్యాటింగ్‌లోనూ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో దిల్లీ క్యాపిటల్స్ ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. లఖ్?నవూతో ఆడిన మ్యాచ్ దిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ విప్రాజ్‌కు ఐపీఎల్ అరంగేట్రం మ్యాచ్. తొలి గేమ్?లోనే జట్టును ఆదుకొని విజయపథంలో నడిపించాడు. 210 లక్ష్య ఛేదనలో దిల్లీ ఓ దశలో 113 పరుగులకే 6 వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో 13 ఓవర్‌లో విప్రాజ్ బరిలోకి దిగి కేవలం 15 బంతుల్లోనే 39 పరుగులు బాది లఖ్‌నవూ బౌలర్లను టెన్షన్ పెట్టాడు. రవి బిష్ణోయ్ వంటి అంతర్జాతీయ స్థాయి స్పిన్నర్‌ను సునాయాసంగా ఎదుర్కొని, అతడి ఓవర్లలో బౌండరీలను బాదాడు. ఈ క్రమంలో అశుతోష్‌తో కలిసి కీలకమైన 55 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. యూపీకి చెందిన విప్రాజ్‌ను ఈసారి జరిగిన మెగా వేలంలో దిల్లీ జట్టు రూ.50 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ యంగ్ ప్లేయర్ 2024 యూపీ టీ20 టోర్నీ సీజన్‌లో మెరుపులు మెరిపించి దిల్లీ ఫ్రాంచైజీని ఆకర్షించాడు. యూపీ ఫాల్కన్స్ తరఫున 12 మ్యాచ్‌లు ఆడి 20 వికెట్లు తీశాడు. ఇక దేశవాళీలో 2024-25 సీజన్‌లో తొలిసారి ఉత్తర్?ప్రదేశ్ జట్టు అన్ని ఫార్మాట్లకు ఎంపిక అయ్యాడు. మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఐదు లిస్ట్-ఏ గేమ్‌లు, 8 టీ20లు ఆడాడు.బంగాల్?పై ఆడిన రంజీ మ్యాచ్‌లో నిగమ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు కీలక వికెట్లను తీశాడు. వీరిలో అంతర్జాతీయ ఆటగాడు వృద్ధిమాన్ సాహా వికెట్ కూడా ఉంది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో కూడా కీలకమైన రెండు వికెట్లు కూల్చాడు. మూడు రంజీ మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 8 వికెట్లు పడగొట్టాడు. 2024 కర్నల్ సీకే నాయుడు ట్రోఫీ ఫైనల్‌లో రాణించి అండర్-23 జట్టులో చోటు సంపాదించాడు. 2004లో జన్మించిన విప్రాజ్ తొలుత అండర్-19 వరకు బ్యాటర్‌గానే ఉన్నాడు. ఆ తర్వాత అతడు క్రమంగా లెగ్‌స్పిన్ బౌలింగ్‌లో రాటుదేలాడని టీమ్‌ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తెలిపాడు. బంతిపై చాలా కృషి చేసి మంచి టర్నింగ్ సాధించాడని వెల్లడించాడు. బ్యాటింగ్‌లో కూడా విప్రాజ్ భారీ షాట్లు ఆడటానికి ఏమాత్రం వెనుకంజ వేయడని పేర్కొన్నాడు. అతడి హిట్టింగ్ సామర్థ్యం చూసి తనకు ఆశ్చర్యం వేసిందని చెప్పాడు.



# రాజస్థాన్ పై ఇసాన్ కిషన్ సెంచరీ

### జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు

పలు కారణాలతో కొన్నాళ్లుగా టీమిండియాకు ఇషాన్ కిషన్ దూరమైన సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2025లో తన తొలి మ్యాచులోనే సెంచరీతో అదరగొట్టి అందరి దృష్టిలో పడ్డాడు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ లో కీలక ఆటగాడిగా ఉన్న అతను ఆ జట్టు రిటైన్ చేసుకోకపోవడం వల్ల ఐపీఎల్ మెగా వేలంలోకి వచ్చాడు. వేలంలో ఇసాన్ కిషన్ ను హైదరాబాద్ 11.25కోట్లకు కొనుగోలు చేసింది. ఈ భారీ ధరకు న్యాయం చేస్తూ తొలి మ్యాచులోనే సెంచరీ చేశాడు. ఈ సూపర్ ఇన్నింగ్స్ తో ఇషాన్ ను మళ్లీ టిమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. టీమిండియా తరపున చివరగా 2023 నవంబర్ లో ఆడిన ఇషాన్ కిషన్ ఆ తర్వాత జట్టులో స్థానాన్ని కోల్పోయాడు. కొన్నేళ్ళ క్రితం వరకు వన్డేలు, టీ20ల్లో భారత జట్టులో కీలకంగా వ్యవహరించాడు. వికెట్ కీపర్ గా, బ్యాటర్ గా రాణించాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన అతికొద్ది మంది బ్యాటర్లలో ఇసాన్ కూడా ఒకరు. జాతీయ జట్టుకు ఆడనప్పుడు దేశవాళీలో ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేసింది. కానీ ఆ మాటలను ఇషాన్ ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో అతన్ని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి బీసీసీఐ తప్పించింది. దీంతో 2024లో ఇషాన్ ఐపీఎల్ లో ఆడాడు ఆ తర్వాత వెనక్కి తగ్గిన కిషన్ దేశవాళీ క్రికెట్ ఆడాడు. బుచ్చిబాబు టోర్నీలోనూ రాణించాడు. దీంతో దులీప్ ట్రోఫీలోనూ చోటు దక్కింది. ఇండియా సి తరుపున 126 బంతుల్లో 111 పరుగులు చేసి జాతీయ జట్టులోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని సెలక్టర్లకు సందేశం ఇచ్చాడు. తర్వాత రంజీ ట్రోఫీలో ఝార?ండ్ కు కెప్టెన్సీ వహించి సెంచరీతో అదరగొట్టాడు. విజయ్ హాజారే ట్రోఫీలో సెంచరీ చేశాడు. ఇప్పుడు ఐపీఎల్ లోనూ మెరుపు సెంచరీతో అలరించాడు. ఈ మెగా టోర్నీలో మునుముందు ఇదే జోరు కొనసాగిస్తే మళ్లీ ఇషాన్ జాతీయ జట్టులోకి రావడం ఖాయమని క్రీడా పండితులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

# విప్రజ్ నిగమ్ వల్లే గెలిచే మ్యాచ్‌లో ఓడాం

### లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్

యువ ప్లేయర్ విప్రజ్ నిగమ్ అసాధారణ బ్యాటింగ్‌తోనే గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమిపాలయ్యామని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో వైజాగ్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఒక్క వికెట్ తేడాతో ఓటమిపాలైంది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో అనవసర తప్పిదాలతో లక్నో మూల్యం చెల్లించుకుంది. ఢిల్లీ లోయారార్డర్ సంచలన బ్యాటింగ్‌తో తీవ్ర ఒత్తిడికి గురైంది.ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన రిషభ్ పంత్.. ఈ ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటామని చెప్పాడు. 'మా టాపార్డర్ బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. ఈ వికెట్‌పై ఇది మంచి స్కోర్. జట్టుగా మేం ప్రతీ మ్యాచ్‌లో సానుకూల అంశాలను తీసుకుంటాం. ప్రతీ మ్యాచ్‌లో తప్పిదాల నుంచి గుణపాఠం నేర్చుకుంటాం. బేసిక్స్ తగ్గట్లు సరిగ్గా ఆడితేనే టీమ్ భవిష్యత్తు కూడా బాగుంటుంది.ఆరంభంలోనే మేం వికెట్లు తీసాం. కానీ ఈ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని మాకు తెలుసు. ఢిల్లీకి రెండు కీలకమైన భాగస్వామ్యాలు దక్కాయి. స్టబ్స్, అషుతోష్‌తో పాటు మరో కుర్రాడు(విప్రజ్ నిగమ్) అద్భుతంగా ఆడాడు. అతనే అసాధారణ బ్యాటింగ్‌తో మా విజయవకాశాలను దెబ్బతీసాడు. మేం ఒత్తిడికి లోనయ్యాం. ఇప్పుడిప్పుడే సెట్ అవుతున్నాం. ఈ మ్యాచ్‌లో మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో లక్ కూడా కీలక పాత్ర పోషించింది. మోహిత్ శర్మను స్టంపౌట్ చేసే అవకాశం చేజారింది. అయితే క్రికెట్‌లో ఇవన్నీ సహజమే. ఇలాంటి వాటిపై ఫోకస్ పెట్టకుండా మెరుగైన క్రికెట్ ఆడాలి.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. ఆఖరి ఓవర్‌లో మోహిత్ శర్మను స్టంపౌట్ చేసే అవకాశాన్ని రిషభ్ పంత్ చేజార్చాడు. ఈ స్టంపౌట్ చేసి ఉంటే ఢిల్లీ ఆలౌటై.. లక్నో గెలిచేది. ఈ మ్యాచ్ ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లల్లో 8 వికెట్లకు 209 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసింది. అషుతోష్ శర్మ (31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 66 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. విప్రజ్ నిగమ్(15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39), ట్రిస్టన్ స్టబ్స్(22 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 34) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

# సెంట్రల్ కాంట్రాక్ట్?లో రోహిత్, విరాట్ కు డిమోషన్



త్వరలో బీసీసీఐ వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్?లు దేశవాళీ క్రికెట్ ఆడనందున టీమ్?ఇండియా యంగ్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్?ను బీసీసీఐ గతేడాది సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించింది. అయితే ఇటీవల కాలంలో శ్రేయస్ దేశీయ టోర్నీలు, అంతర్జాతీయ క్రికెట్?లో అదరగొడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో 243 రన్స్ బాది భారత్ తరఫున ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్?గా నిలిచాడు. ఈ క్రమంలో శ్రేయస్ సెంట్రల్ కాంట్రాక్ట్?ను బీసీసీఐ మళ్లీ పునరుద్ధరించనున్నట్లు తెలుస్తోంది. ఏ ఆటగాడు అయినా సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి రావాలంటే ఒక నిర్దిష్ట క్యాలెండర్ ఇయర్?లో మూడు టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడాలి. శ్రేయస్ అయ్యర్ ఈ సీజన్ లో 11 మ్యాచ్?లు ఆడాడు. కాబట్టి సెంట్రల్ కాంట్రాక్ట్?లో అతడ్ని తీసుకోవచ్చని తెలుస్తోంది. అయితే టీమ్?ఇండియా హెడ్ కోచ్ గంభీర్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వంటివారు అంగీకారం తెలిపితేనే శ్రేయస్?కు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కే అవకాశం ఉంది.భారత మహిళల జట్టు సెంట్రల్ కాంట్రాక్ట్?లను బీసీసీఐ సోమవారం ప్రకటించింది. మరికొద్ది రోజుల్లో టీమ్ ఇండియా పురుషుల జట్టు కేంద్ర కాంట్రాక్ట్?ను ప్రకటించే అవకాశం ఉంది. ఏం కేటగిరీలో ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జడేజా అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పేశారు. దీంతో వారి సెంట్రల్ కాంటాక్ట్ కేటగిరీ కేటాయింపులపై బీసీసీఐ సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. బుమ్రాను %ూ% కేటగిరీలో కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఏ కేటగిరీలో ఉన్న అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్?కు గుడ్ బై చెప్పేశాడు. దీంతో అతడిని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. అలాగే టీమ్?ఇండియా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ వన్డే, టీ20ల్లో రెగ్యులర్ ప్లేయర్?గా ఉన్నాడు. ఇప్పటివరకు 14 టెస్టులు కూడా ఆడాడు. అన్ని ఫార్మాట్లలోనూ బ్యాట్, బాల్?తో ఫర్వాలేదనిపిస్తున్నాడు. ఈ క్రమంలో అక్షర్ పటేల్?ను బీ కేటగిరీ నుంచి ఏకి ప్రమోట్ చేసే అవకాశం ఉంది. యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ తన గ్రేడ్ బీ కాంట్రాక్ట్ నుంచి పదోన్నతి పొందుతాడా లేదా చూడాలి. ఈ క్యాలెండర్ ఇయర్?లో 7 టెస్టులు ఆడిన పేసర్ ఆకాశ్ దీప్, 3 మ్యాచ్?లు ఆడిన సర్ఫరాజ్ ఖాన్?ను గ్రూప్ సీలో చేర్చే అవకాశం ఉంది. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో రాణించిన నితీశ్ కుమార్ రెడ్డి కూడా ఈ సారి సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు అవకాశం ఉంది. శార్దుల్ ఠాకూర్, రుతురాజ్ గైక్వాడ్ గతేడాది సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. కానీ ఈ ఏడాది వారు సెంట్రల్ కాంట్రాక్ట్ పొందేందుకు కనీస మ్యాచ్?లను ఆడలేదు. దీంతో వారికి ఈ ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్?లు దక్కుతాయా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

# విశ్వజి

# ఉదయాన్నే గుప్పెడు ఈ సీడ్స్ తింటే చాలు..



### కొలెస్ట్రాల్ వెన్నలా కరిగిపోవాల్సిందే!

ప్రకృతి మనకు అందించిన అద్భుతమైన ఆహారాలలో పొద్దుతిరుగుడు విత్తాలు ఒకటి. ఇవి చూడ్డానికి చిన్నగా కనిపించినా.. ఈ గింజల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే వీటిని సూపర్ ఫుడ్ అని కూడా పిలుస్తారు. చాలా మంది పొద్దుతిరుగుడు విత్తనాలను స్నాక్స్‌గా తింటారు. కానీ వీటిని ఉదయాన్నే తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. శరీరం రోజంతా ఆరోగ్యంగా , శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. పొద్దుతిరుగుడు విత్తనాల్లో పోషకాలు ముఖ్యంగా పొద్దుతిరుగుడు విత్తనాల్లో విటమిన్ ఇ, మెగ్నీషియం, సెలీనియం, లినోలెయిక్ ఆమ్లం (ఒమేగా-6 కొవ్వు ఆమ్లం), ప్రొటీన్లు, ఫైబర్ , అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శక్తిని పెంచుతాయి: ఉదయం పూట పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల మీకు తక్షణ శక్తి లభిస్తుంది. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడతాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు వీటిని తీసుకోవడం వల్ల మీరు రోజంతా ఉత్సాహంగా ఉంటారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఈ విత్తనాల్లో లినోలెయిక్ ఆమ్లం (ఒమేగా-6 కొవ్వు ఆమ్లం) ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, వీటిలో ఉండే మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది, తద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి: పొద్దుతిరుగుడు విత్తనాల్లో విటమిన్ ఇ, సెలీనియం వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాలను నష్టం నుండి రక్షిస్తాయి. తద్వారా రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. వ్యాధుల నుండి శరీరాన్ని కాపాడతాయి. చర్మం , జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: దీనిలోని విటమిన్ ఇ చర్మానికి, జుట్టుకు చాలా మంచిది. ఇది చర్మాన్ని తేమగా ఉంచడానికి, మృదువుగా చేయడానికి , యవ్వనంగా కనిపించేలా చేయడానికి సహాయపడుతుంది. అలాగే, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉదయం తినడం వల్ల మీ చర్మం, జుట్టు ఆరోగ్యంగా, అందంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి: పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడుతుంది. ఉదయం పూట వీటిని తినడం వల్ల మీ జీర్ణ వ్యవస్థ రోజంతా సక్రమంగా పనిచేస్తుంది. మీరు తేలికగా మరియు ఆరోగ్యంగా ఉంటారు. పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఫైబర్ , ప్రొటీన్లు పుష్కలంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది . ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. తద్వారా మీరు తక్కువగా ఆహారం తీసుకుంటారు . బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో వీటిని చేర్చుకోవడం వల్ల మీరు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించవచ్చు. ఎముకలను బలంగా చేస్తాయి: దీనిలోని మెగ్నీషియం , ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలను బలంగా చేయడానికి , ఎముకల సాంద్రతను పెంచడానికి సహాయపడతాయి. వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడకుండా ఉండటానికి పొద్దుతిరుగుడు విత్తనాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి: పొద్దుతిరుగుడు విత్తనాల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది, ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి అవసరం. సెరోటోనిన్ ఒక న్యూరోట్రాన్స్మిటర్, ఇది మానసిక స్థితిని మెరుగుపరచడానికి మరియు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. ఉదయం పూట పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల మీరు రోజంతా ప్రశాంతంగా మరియు సంతోషంగా ఉంటారు. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉదయం ఎలా తినాలి? పొద్దుతిరుగుడు విత్తనాలను ఉదయం తినడానికి చాలా మంచిది. నేరుగా గుప్పెడు పొద్దుతిరుగుడు విత్తనాలను తినవచ్చు. వీటిని వేయించి లేదా పచ్చిగా కూడా తినవచ్చు. వేయించిన విత్తనాలు రుచిగా ఉంటాయి, కానీ పచ్చి విత్తనాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. మీ ఉదయపు ఓట్‌మీల్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది ఓట్‌మీల్‌కు రుచిని, పోషకాలను జోడిస్తుంది . అంతే కాకుండా యోగర్ట్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది యోగర్ట్‌కు కరకరలాడే ఆకృతిని , పోషకాలను జోడిస్తుంది. ఉదయపు స్మూతీస్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది స్మూతీస్‌కు పోషకాలను , చిక్కదనాన్ని జోడిస్తుంది. అంతే కాకుండా ఉదయం సలాడ్స్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది సలాడ్స్‌కు రుచిని మరియు పోషకాలను జోడిస్తుంది.



## నమ్మండి ... ఈ అలవాట్లతో మీరు యవ్వనంగా ఉంటారు!

ఆరోగ్యంగాను, యవ్వనంగానూ ఉండాలని ఎవరు మాత్రం కోరుకోరు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా, యవ్వనంగా ఉండాలనుకుంటారు. అటువంటివారు ఒక ఎనిమిది అలవాట్లను చేసుకుంటే యవ్వనంగా ఉంటారు. వృద్ధాప్యం రాకుండా ఎక్కువ కాలం జీవిస్తారు. మరి ఆ అలవాట్లు ఏమిటో తెలుసుకుందాం. మన హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వల్ల మన వయసు కూడా కాస్త తగ్గినట్టుగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆహారం విషయంలో జాగ్రత్త అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఈ నేపథ్యంలోనే ఎక్కువ కాలం యవ్వనంగా ఉండడం కోసం అవసరమైన అలవాట్లను వెల్లడించింది. వృద్ధాప్యాన్ని తగ్గించే రోజువారి అలవాట్లలో ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పండ్లు, కూరగాయలు, మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ట్రాన్స్ ఫ్యాట్స్, వేయించిన ఆహారాలు, చక్కెర ఆహారాలను తగ్గించాలి. యవ్వనంగా ఉండాలంటే వీటికి దూరంగా ఉండండి యవ్వనంగా ఉండాలనుకునే వారు వ్యాయామం రెగ్యులర్ గా చేయాలి. డయాబెటిస్, రక్తపోటు, కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ప్రతిరోజు వ్యాయామం చేయడం సూచించబడింది. ఇక యవ్వనంగా ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు ధూమపానాన్ని మానుకోవాలి. ధూమపానం మద్యపానం ఆరోగ్యం పైన ప్రభావం చూపి త్వరగా వృద్ధాప్యం వచ్చేలా చేస్తాయి. కనుక వీటికి దూరంగా ఉండాలి. నిద్ర, బరువు, కొలెస్ట్రాల్ కంట్రోల్ తో యవ్వనం యవ్వనంగా ఉండాలని భావించేవారు ప్రతిరోజు ఏడు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర పోవాలి. ఒకవేళ సరైన నిద్రపోకుంటే అది ఊబకాయానికి దారి తీస్తుంది. కనుక జాగ్రత్త వహించాలి. ఇక యవ్వనంగా కనిపించాలి అనుకునేవారు బరువును నియంత్రించాలి. ఆరోగ్యకరమైన బరువును మెయింటైన్ చేస్తే వయసు తగ్గినట్టు కనిపిస్తుంది. యవ్వనంగా కనిపించాలని భావించేవారు కొలెస్ట్రాల్ ను తగ్గించుకోవాలి. పాదాలలో ఈ లక్షణాలు కనిపిస్తే డేంజర్ బెల్స్ మోగినట్టే.. జాగ్రత్త! గ్యాస్ట్రిక్ సమస్యలు రాకుండా చూసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే గుండెపోటు స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. బ్లడ్ షుగర్ ని ఎప్పటికప్పుడు నియంత్రణలో ఉంచుకోవాలి. డయాబెటిస్ కంట్రోల్ లో ఉంటే ఆరోగ్యంతో పాటు యవ్వనంగా కూడా ఉంటారు. ఇక రక్తపోటును అదుపులో ఉంచుకుంటే వృద్ధాప్య ప్రక్రియను స్లో చేయడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి యవ్వనంగా ఉండాలని భావించేవారు పైన సూచించిన అలవాట్లను తప్పనిసరిగా చేసుకోండి.

## రక్తపోటును సహజంగా తగ్గించి నైట్రిక్ ఆక్సైడ్ పెంచే సూపర్ ఫుడ్స్ ఇవే!




రక్తపోటు పెరగడం అనేది నేడు చాలా మందిని వేధిస్తున్న ఒక సమస్య. దీనిని నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి ప్రమాదకర పరిస్థితులకు దారితీయవచ్చు. అయితే, సరైన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తపోటును సహజంగా తగ్గించుకోవచ్చు , నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలను పెంచుకోవచ్చు. ఈ నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను వెడల్పు చేసి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, తద్వారా రక్తపోటు తగ్గుతుంది. రక్తపోటును తగ్గించడానికి, నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచడానికి సహాయపడే కొన్ని అద్భుతమైన ఆహారాలను తెలుసుకుందాం.. నైట్రిక్ ఆక్సైడ్ - రక్తపోటు మధ్య సంబంధం: నైట్రిక్ ఆక్సైడ్ మన శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే ఒక ముఖ్యమైన అణువు. ఇది రక్తనాళాల లోపలి పొరలో ఉత్పత్తి అవుతుంది. రక్తనాళాలను విశ్రాంతింపజేయడంలో సహాయపడుతుంది. రక్తనాళాలు వెడల్పుగా ఉన్నప్పుడు, రక్తం మరింత స్వేచ్ఛగా ప్రవహిస్తుంది, తద్వారా రక్తపోటు తగ్గుతుంది. తక్కువ నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలు రక్తనాళాల సంకోచానికి దారితీస్తాయి, ఇది రక్తపోటును పెంచుతుంది. రక్తపోటును తగ్గించి నైట్రిక్ ఆక్సైడ్ పెంచే ఆహారాలు: ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర, మెంతి కూర, తోటకూర వంటి ఆకుకూరలు నైట్రేట్‌లకు గొప్ప మూలం. ఈ నైట్రేట్‌లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మార్చబడతాయి. ఒక అధ్యయనం ప్రకారం, రోజుకు ఒక కప్పు ఆకుకూరలు తినడం ద్వారా రక్తపోటు గణనీయంగా తగ్గుతుంది. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి, ఇవి మొత్తం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. బీట్‌రూట్: బీట్‌రూట్ కూడా నైట్రేట్‌లకు అద్భుతమైన మూలం. బీట్‌రూట్ జ్యూస్ తాగడం లేదా బీట్‌రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచవచ్చు. అధ్యయనాలు బీట్‌రూట్ జ్యూస్ రక్తపోటును త్వరగా తగ్గించగలదని నిరూపించాయి. బీట్‌రూట్‌లో ఫోలేట్, పొటాషియం, ఫైబర్ కూడా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. వెల్లుల్లి ఉల్లిపాయలు: వెల్లుల్, ఉల్లిపాయలు అల్లిసిన్ అనే సమ్మేళనాన్ని కలిగి ఉంటాయి, ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి రక్తనాళాలను వెడల్పు చేయడమే కాకుండా రక్తం గడ్డకట్టకుండా కూడా సహాయపడుతుంది. ప్రతిరోజు ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయలు కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్‌ను కలిగి ఉంటాయి. దానిమ్మ: దానిమ్మ పండ్లు యాంటీఆక్సిడెంట్లకు, పాలీఫెనాల్స్‌కు గొప్ప మూలం. దానిమ్మ రసం నైట్రిక్ ఆక్సైడ్ బయోయాక్టివిటీని పెంచుతుంది. రక్తపోటును తగ్గిస్తుంది. దానిమ్మలో ఉండే ప్యూనికాలగిన్స్ రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రోజుకు ఒక గ్లాసు దానిమ్మ రసం తాగడం రక్తపోటును నియంత్రించడానికి ఒక రుచికరమైన మార్గం. బెర్రీలు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్‌బెర్రీలు , బ్లాక్‌బెర్రీలు వంటి బెర్రీలు ఫ్లేవనాయిడ్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. ఈ ఫ్లేవనాయిడ్స్ నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలను పెంచడంలో, రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. బెర్రీలు యాంటీఆక్సిడెంట్లకు గొప్ప మూలం, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. రోజూ ఒక కప్పు బెర్రీలు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. పుచ్చకాయ: పుచ్చకాయలో ఎల్-సిట్రులిన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో ఎల్-ఆర్జినైన్‌గా మార్చబడుతుంది, ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి అవసరం. పుచ్చకాయ తినడం వల్ల నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలు పెరుగుతాయి. రక్తపోటు తగ్గుతుంది. పుచ్చకాయ వేసవిలో లభించే ఒక రిఫ్రెష్, ఆరోగ్యకరమైన పండు. నట్స్ , విత్తనాలు: వాల్నట్స్, బాదం, గుమ్మడికాయ విత్తనాలు, చియా విత్తనాలు వంటి నట్స్, విత్తనాలు ఎల్-ఆర్జినైన్‌కు మంచి మూలం. ఎల్-ఆర్జినైన్ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి అవసరమైన అమైనో ఆమ్లం. నట్స్, విత్తనాలలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ , ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. రోజుకు ఒక గుప్పెడు నట్స్ లేదా విత్తనాలు తినడం ఆరోగ్యకరమైన అలవాటు. సిట్రస్ పండ్లు: నారింజ, నిమ్మ, ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లు విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లకు గొప్ప మూలం. విటమిన్ సి నైట్రిక్ ఆక్సైడ్ బయోయాక్టివిటీని మెరుగుపరుస్తుంది. రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. సిట్రస్ పండ్లు రక్తపోటును తగ్గించడంలో , గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

# మార్కెట్

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. టారిఫ్ నుంచి పలు దేశాలకు ఊరట కల్పిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంకేతాలతో స్టాక్ మార్కెట్లు ఉదయం లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 78వేల పాయింట్లు దాటింది. ఈ క్రమంలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. దాంతో ఆరంభంలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. చివరలో స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 78,296.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 78,741.69 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 77,745.63 పాయింట్లను తాకింది. చివరకు 32.8 పెరిగి 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి.. 23,668.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,019 షేర్లు పెరగ్గా.. 2,868 షేర్లు పతనమయ్యాయి. ఐటీ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఆయిల్, గ్యాస్, పవర్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, టెలికాం షేర్లు ఒకటి నుంచి 1.5శాతం పతనమయ్యాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పతనమయ్యాయి.



## ఆపిల్ నుంచి అదరిపోయేలా మడతపెట్టే ఫోన్..!

ఆపిల్ కంపెనీ చాలాకాలంగా 4-మోడల్ ఐఫోన్ సిరీస్‌ను కొనసాగిస్తున్నది. ఈ ఏడాది నుంచి మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆపిల్ ఈ ఏడాది ఐఫోన్ 17 ఎయిర్‌ను విడుదల చేయాలని యోచిస్తున్నది. ఇది ప్లస్ వేరియంట్‌ని భర్తీ చేయనున్నది. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ.. కంపెనీ 2026 కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని విడుదల చేసే అవకాశం ఉన్నది. కొత్త బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఆపిల్ ఈ డివైజ్ కోసం క్లామ్‌షెల్ (ఫ్లిప్) డిజైన్ కాకుండా శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ తరహాలో బుక్ స్టయిల్ డిజైన్‌ను తీసుకురానున్నది. నివేదిక ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్‌ని పోలి ఉండనున్నట్లు తెలుస్తున్నది. డిజైన్ ఐఫోన్ 17 ఎయిర్ నుంచి ప్రేరణగా తీసుకోనున్నది. ఆపిల్ త్వరలో తీసుకురానున్న ఐఫోన్ 17 ఎయిర్ అల్ట్రా సిమ్‌గా తెలుస్తున్నది. కేవలం 5.5 ఎంఎం మందం మాత్రమే ఉండనున్నట్లు తెలుస్తున్నది. దాంతో కెమెరా, స్పీకర్ క్వాలిటీలో రాజీ పడక తప్పదని నివేదిక పేర్కొంది. కానీ, బ్యాటరీ లైఫ్



ఐఫోన్ 16ఈ తరహాలోనే ఉంటుంది. ఇక ఐఫోన్ 17 ఎయిర్ వినూత్న డిజైన్‌ను ఆపిల్ భవిష్యత్ ఫోల్డబుల్ ఐఫోన్‌కు పునాదిగా భావిస్తున్నది. లీకుల ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ పూర్తిగా తెరిచిన సమయంలో 7.8 ఇంచెస్ మెయిన్ డిస్‌ప్లే, 5.5 ఇంచెస్ ఎక్స్‌టర్నల్ స్క్రీన్‌తో వస్తుంది. స్ట్రాంగ్, డ్యూరబుల్‌తో ఫోన్‌ని తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందు కోసం లిక్విడ్ మెటల్‌ని ఉపయోగించనున్నట్లు సమాచారం. ఫోల్డబుల్ ఫోన్ ఓపెన్ చేసిన సమయంలో 4.5 ఎంఎం.. మతపెట్టిన సమయంలో 9 ఎంఎం నుంచి 9.5 ఎంఎం మందం ఉండనున్నది. ఇదే నిజమైతే ఇప్పటి వరకు ఉన్న ఫోల్డబుల్ ఫోన్‌లలో ఇదే స్లిమ్ ఫోన్‌గా మారనున్నది. ఇక ఆపిల్ ఫేస్ టచ్ ఐడీకి బదులుగా టచ్ ఐడీ సెన్సార్‌ను తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ఫోన్ క్వాలిటీని మెరుగుపరిచేందుకు టైటానియం ఛాసిస్‌ను ఉపయోగించవచ్చని తెలుస్తున్నది. దాంతో మొబైల్ తక్కువ బరువుతో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. ఇప్పటి వరకు మొబైల్ స్పెసిఫికేషన్స్‌ను ఆపిల్ వెల్లడించలేదు. కేవలం ఇవన్నీ లీకులు మాత్రమే. ఇక ఈ మొబైల్ ధర అమెరికాలో 2,300 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.91లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తున్నది.

## మార్కెట్లకు ఎఫ్ఐఐల కిక్కు

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస లాభాలు కొనసాగుతున్నాయి. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,078.87 పాయింట్లు లేదా 1.40 శాతం ఎగిసి 77,984.38 వద్ద స్థిరపడింది. ఇది 6 వారాల గరిష్ఠం కావడం విశేషం. ఒకానొక దశలో 1,200 పాయింట్లకుపైగా పెరిగి 78,107.23 పాయింట్లదాకా ఎగబాకింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 307.95 పాయింట్లు పుంజుకొని 23,658.35 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 23,708.75 స్థాయిని తాకింది. దీంతో వరుసగా ఆరోరోజూ మార్కెట్లు లాభాల్లోనే ముగిసినైట్లైంది. అమెరికా, ఐరోపా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం కలిసొచ్చింది. ముఖ్యంగా ఏప్రిల్ 2 నుంచి భారత్, చైనాసహా అనేక దేశాలపై ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పునరాలోచనలోపడటం ఇన్వెస్టర్లను మెప్పించిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పైగా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను రాబోయే ద్రవ్యసమీక్షల్లో తగ్గిస్తుందన్న అంచనాలూ గట్టిగానే ఉన్నాయి. ఇవి ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలకు దోహదం చేస్తాయని అభిప్రాయపడుతున్నారు. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ క్రమేణా పెరుగుతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్లలో మళ్లీ పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తుండటం కూడా సూచీలను పరుగులు పెట్టిస్తున్నది. గత 6 రోజుల్లో ఎఫ్ఐఐల నికర పెట్టుబడులు రూ.8,874.88 కోట్లుగా ఉన్నాయి. నిజానికి గత 5 నెలల్లో రూ.2.5 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. మరోవైపు బ్యాంకింగ్, యుటిలిటీస్, పవర్, ఇండస్ట్రియల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ రంగాల షేర్లు 2.53 శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ 1.17 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో ఎన్టీపీసీ షేర్ విలువ అత్యధికంగా 4.61 శాతం పెరిగింది. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ లాభాల్లో ముగియగా, దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టపోయాయి. 27.10 లక్షల కోట్లు జూమ్.. స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో కదలాడుతుండటంతో మదుపరుల సంపద కూడా అంతకంతకూ పెరుగుతూపోతున్నది. గత 6 రోజుల్లో బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.27.10 లక్షల కోట్లు ఎగబాకింది. ఈ 6 రోజుల్లో సెన్సెక్స్ 4,155.47 పాయింట్లు లేదా 5.62 శాతం, నిఫ్టీ 1,261.15 పాయింట్లు లేదా 5.63 శాతం ఎగిశాయి. ముఖ్యంగా నాలుగేండ్ల తర్వాత గత వారం మార్కెట్లు అత్యుత్తమ లాభాలను అందుకున్నాయి. ఐదు రోజుల్లో సెన్సెక్స్ 3,077 పాయింట్లు, నిఫ్టీ 953 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా రూ.27,10,918.98 కోట్లు పుంజుకొని రూ.4,18,29,351.91 కోట్లకు చేరింది.

# పేదలకు న్యాయం చేయాలన్నదే సీఎం తపన

**22ఏ, ఫ్రీహోల్డ్ భూములపై ప్రత్యేక డ్రైవ్**
**జిల్లాల్లో ప్రత్యేకంగా రియల్ ఎస్టేట్ కమిటీల ఏర్పాటు**
**భూ సమస్యలపైన కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి**
**రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**



అమరావతి : రాష్ట్రంలో ప్రైవేటు భూములేవీ కూడా 22ఏలో ఉండకూడదనేదే ప్రభుత్వ ఆశయమని, ఆ దిశగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రజలకు భూమి అనేది సెంటిమెంటుతో కూడుకున్న వ్యవహారమని, పేదలకైతే అది ఒక భరోసా, క్షేత్రస్థాయిలో ప్రజలు తమ భూములకు సంబంధించి వివాదాలు లేకుండా హాయిగా ఉండాలని చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల భూ వివాదాల పరిష్కారానికి జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సచివాలయంలో మంగళవారం ప్రారంభమైన 3వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు మేలు చేయాలనే ఒక ధృడసంకల్పంతో పనిచేస్తున్నారని, జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ప్రజలు, ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లో మూడు సార్లు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. సామన్యులకు, పేదలకు ఎటు-వంటి నష్టం కల్గకుండా క్షేత్రస్థాయిలో భూ సంబంధ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఎప్పుడూ చెబుతుంటారని, క్షేత్రస్థాయిలో పేదలు తమ భూములకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ తొమ్మిది నెలల కాలంలో రెవెన్యూ శాఖలో పలు సంస్కరణలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ -టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంతో పాటు-, ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టాన్ని, ఆర్ ఓ ఆర్ చట్టాలను తీసుకొచ్చామని తెలిపారు. ఆర్ ఓ ఆర్ చట్టాన్ని సవరించి అప్పీల్ అధికారాన్ని డీ ఆర్వో ల నుండి ఆర్డీవోలకు మార్చాం. దీంతో భూ యజమానులకు త్వరగా వారి అప్పీళ్లు పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రైవేటు- భూములు ఎట్టిపరిస్థితిలోనూ 22ఏ వివాదాల్లో ఉండకూడదన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. చాలా మందికి తమ భూమి ఎందుకు 22ఏ వివాదంలో ఉందో కూడా తెలీదన్నారు. జిల్లా కలెక్టర్లు కూడా జిల్లాల్లో భూ వివాదాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నాన్నారు. రెవెన్యూ శాఖలో భూ వివాదాలకు సంబంధించి ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, అర్జీలను అన్నిటిని పరిష్కరిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను కూడా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.700 కోట్లు- దుర్వినియోగం చేసి సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకుంటే ఇప్పుడు వాటిని తొలగిస్తున్నామన్నారు. రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టాదారు పాసుపుస్తకాలను అత్యంత పారదర్శక విధానంతో అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ అబ్జెక్షనబుల్ ల్యాండ్స్ ఉన్న పేదలకు ఆ భూమిని క్రమబద్దీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని, 22ఏ భూముల వివాదాల పరిష్కారంపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు-ందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి కోసం ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని, దీనికి జిల్లా కలెక్టర్లు సహకారం అందివ్వాలని కోరారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తప్పుల తడకగా సాగింది. రీ సర్వేపైన గ్రామ సభలు పెట్టాం. ఆ తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. వీటితోపాటు- పిజిఆర్ఎస్ లోనూ గ్రీవెన్స్ వస్తున్నాయి. వీటిల్లో 90 శాతం పరిష్కరించామని, వీటిని క్వాలిటీ డిస్పోజల్ చేయాలని ముఖ్యమంత్రి ఎప్పుడూ చెబుతుంటారు. కలెక్టర్లు ఆ దిశగా పని చేయాలన్నారు. రీ సర్వేను కూటమి ప్రభుత్వం చాలా పకడ్బందీగా చేస్తోంది. రోజుకు 20 ఎకరాల్లోనే చేస్తున్నాం. కొత్తగా పాసుపుస్తకం జారీ చేయడంతో పాటు-, దానికి జియోట్యాగింగ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో పలు చోట్ల భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయని, ఇలాంటి కేసులు కూడా త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ప్లీడర్లతో సమావేశమై ఆ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రజలు తమ భూముల సమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారుల వద్దకు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని, ఒకవేళ చేయలేకపోతే ఎందుకు చేయలేకపోతున్నామో చెప్పగలిగేలా ఒక స్పీకింగ్ నోట్ ఇచ్చే పరిస్థితికి చేరుకోవాలని కోరారు. ఎమ్మార్వో కార్యాలయాల్లో అధికారులు సిబ్బంది సిటిజన్ ఫ్రెండ్లీగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి వల్ల రాష్ట్రంలో పెట్టు-బడులు పెట్టడానికి ఎంతోమంది ముందుకు వస్తున్నారని, అయితే క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఫ్రీ హోల్డ్ భూములు ఎలాంటి వివాదాలు లేకుండా చూసుకోవాలన్నారు. వివాదాలుంటే పెట్టు-బడులపై ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదముంటుందన్నారు. దీనికోసం జిల్లాల్లో ప్రత్యేకించి ఒక రియల్ ఎస్టేట్ కమిటీ- ఏర్పాటు- చేసుకోవాలన్నారు. జిల్లా, రెవెన్యూ, మున్సిపాల్టీ, పంచాయతీ, పట్టణాభివృద్ధి సంస్థలు, బ్యాంకర్లు అందరూ ఈ కమిటీ-లో సభ్యులుగా ఉండేలా చూడాలన్నారు. ఈ కమిటీ- ప్రతి నెల లేదా రెండు నెలలకు ఒకసారి సమావేశమై ఆయా జిల్లాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న వివాదాలు పరిష్కరించాలని కోరారు.

# పథకాల సమర్థ అమలుకు చర్యలు

**రెండు రోజుల సదస్సులో దిశా నిర్దేశం**
**కలెక్టర్ సదస్సులో సిఎస్ వెల్లడి**

అమరావతి : సంక్షేమ అభివృద్ధి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా నిర్దేశిత లక్ష్యాల సాధనకు కలెక్టర్లకు తగిన దిశానిర్దేశర చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. అదే విధంగా ఆయా పథకాలు, కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈరెండు రోజుల సమావేశంలో కృషి చేయడం జరిగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు- జరిగే కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా నిర్దేశిరచుకున్న లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశనర చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ పథకాలు, కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి స్థాయి అధికారిని జిల్లా ఇన్చార్జి గా నియమించడం జరిగిందని చెప్పారు. ఈసమావేశంలో జిల్లాల వారీగా జిల్లా కార్యాచరణ ప్రణాళికల గురించి కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇస్తారని సిఎస్ చెప్పారు.అదే విధంగా వాట్సాప్ గవర్నెన్స్,గ్రీవియెన్స్ రిడ్రస్సల్ విధానం, భూ సంబంధిత అంశాలు,సమ్మర్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించడం జరుగుతుందని అన్నారు. పియం సూర్య ఘర్ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ తయారీ యూనిట్లు- ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని ఆలక్ష్య సాధనకు కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.అంతేగాక వివిధ ఉత్తమ విధానాలను అవలంభించడం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్లకు సిఎస్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు- జరుగనున్న 3వ జిల్లా కలెక్టర్ల సమావేశం ప్రారంభమైంది.ఈసమావేశంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,డిజిపి హరీశ్ కుమార్ గుప్తా,వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌పై బహిరంగ వ్యాఖ్యలు సరికాదు

**చంద్రబాబు,పవన్ కేంద్రంతో టచ్‌లోనే ఉన్నారు**
**ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్య**

రాజమండ్రి : నియోజకవర్గాలు పునర్విభజనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేంద్రంతో అంతర్గతంగామాట్లాడుతున్నారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్నాం కాబట్టి ఈ వ్యవహారంపై బహిరంగంగా మాట్లాడకూడదని పేర్కొన్నారు.. జనాభా విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ముందు నుంచి చాలా క్రమశిక్షణ పాటించాయి.. ఇప్పుడు జనాభా పేరుతో సీట్లు- తగ్గించడం సరికాదని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించారు. జగన్ అపర గోబెల్స్ లా మాట్లాడాడు.. మరో మూడేళ్ల తర్వాత అధికారంలోకి వస్తానని జగన్ అంటున్నాడు.. జగన్ వచ్చేది రాజమండ్రి సెంట్రల్ జైలుకే అంటూ చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. లిక్కర్, మైనింగ్ కుంభకోణాలు ఒక్కొక్కటి బయటికి వస్తున్నాయి.. జగన్ హయాంలో పంటలకు ఇన్సూరెన్స్ కూడా చెల్లించక రైతులు వేల కోట్ల నష్టపోయారు.. జగన్ హయాంలో గ్రామాల్లో ఒక రోడ్డు కూడా వేయలేదని విమర్శించిన ఆయన.. జగన్ మళ్లీ జైలు ఊచలు లెక్కించాల్సిందే అన్నారు.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం సహాయ నిధి నుంచి ప్రజలను ఆదుకుంటున్నాం.. మేలో తల్లికి వందనం, జూన్ లో అన్నదాత సుఖీభవ అమల చేయబోతున్నాం.. రానున్న పుష్కరాలకు రాజమండ్రి చుట్టు-పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందెల ప్రణాళికలు వేస్తున్నామని వెల్లడించారు.. రాజమండ్రిలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణం జరగబోతుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నితో ఇప్పటికే మాట్లాడానని తెలిపారు.. గతంలో వైసీపీ కార్యాలయానికి రాజమండ్రిలో అధికారులు తక్షణమే స్థలం ఇచ్చేశారు.. కానీ, టీ-డీపీ కార్యాలయం కోసం స్థలం అడుగుతుంటే అధికారులు ఇవ్వడం లేదని గోరంట్ల బుచ్చయ్య చౌదరి మండిపడ్డారు.

# సీస్కోతో ఒప్పందం చేసుకున్న మంత్రి లోకేశ్




అమరావతి : ఐటీ , అడ్వాన్స్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం సిస్కోతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సిస్కో- ఏపీఎస్ఎస్ డీసీ ఎంవోయు జరిగింది. ఈ ఒప్పందం ద్వారా 50 వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారు. విద్యార్థుల్లో ఐటి, అడ్వాన్స్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రఖ్యాత ఐటి సంస్థ సిస్కో, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నడుమ ఒప్పందం జరిగింది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాల ప్రతినిధులు ఎంవోయుపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సిస్కో విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, వంటి రంగాలలో అత్యాధునిక కంటెంట్‌ను అందిస్తోంది. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఏ కోర్సుల్లో శిక్షణ అందించాలో ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రాధాన్యతల ఆధారంగా కోర్సుల జాబితాను ఖరారు చేస్తారు. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, ఉపాధిని పెంపొందించడమే ఈ సహకారం లక్ష్యం. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించేలా సిస్కో వర్చువల్ విధానంలో పోర్టల్ ద్వారా స్వీయ-అభ్యసన, బోధకుల నేతృత్వంలో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది. విద్యార్థులకు ఆయా సంస్థల డిమాండ్ ఆధారిత కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను డిజైన్ చేస్తారు. మారుతున్న సాంకేతికలకు అనుగుణంగా ముందస్తు అవసరాలకు సరిపడా సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా లెర్నర్ పార్టిసిపేషన్, కాంపిటీషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, వర్క్ షాప్స్ నిర్వహణ వంటివి ఏపీఎస్ఎస్ డీసీ చేపడుతుంది. ఆయా కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు, ఉద్యోగులకు సిస్కో సర్టిఫికెట్లను జారీచేస్తుంది. ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లను అందిస్తారు. అధునాతన టెక్నాలజీలో యువత, విద్యార్థులకు మద్ధతునిచ్చే ఫైండ్ యువర్ సెల్ఫ్ ఇన్ ద ఫీచర్ (ఎఫ్‌వైఐఎఫ్) వంటి ప్రోగ్రామ్ లను సిస్కో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుంది.

# జగ్గయ్యపేటలో భారీ అగ్ని ప్రమాదం

**మిర్చికోల్డ్‌స్టోరేజీలో చేలరేగిన మంటలు**

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. జగయ్యపేట మండలం తొర్రగుంటపాలెంలోని మిర్చి కోల్డ్ స్టోరేజీ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి గిడ్డంగి మొత్తానికి వ్యాపించడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడుతున్నాయి. దీంతో మిర్చి నిల్వలు దగ్ధమవుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. గోడౌన్‌లో సుమారు రూ.12 కోట్ల విలువైన మిర్చి నిల్వలు ఉన్నట్లు సమాచారం. కాగా, గోదామ్‌లో మొత్తం 40 వేల మిర్చి బస్తాలు ఉన్నాయని సమాచారం. అన్నీ కాలిబూడిదయ్యాయి. పొగ, మిర్చి ఘాటుతో పరిసర గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తుమ్ములు, దగ్గుతో గ్రామస్తులు అవస్తలు పడుతున్నారు.

# పోలీసు విచారణకు రీతుచౌదరి గైర్హాజరు

**కోర్టును ఆశ్రయించిన విష్ణుప్రియ**

హైదరాబాద్ : బెట్టింగ్ యాప్స్‌పై విచారణ కొనసాగుతుంది.ఈక్రమంలో బెట్టింగ్ యాప్స్ వ్యవహారానికి సంబంధించి తమ ఎదుట విచారణకు రావాలంటూ రీతూ చౌదరి, విష్ణుప్రియకు ఇప్పటికే పోలీసులు నోటీసులు ఇచ్చారు. గత గురువారం ఇద్దర్నీ కూడా పోలీసులు విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అలాగే మరోసారి విచారణకు రావాలని ఇద్దరికి సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలంటూ చెప్పగా... ఇప్పటి వరకు విష్ణుప్రియ, రీతూ చౌదరి విచారణకు రాలేదు. ఓవైపు విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ యాంకర్ విష్ణుప్రియ మాత్రం హైకోర్టులో పిటిషన్ వేశారు. తనపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బెట్టింగ్ వ్యవహారానికి సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయని, ఈ రెండింటినీ క్వాష్ చేయాలంటూ హైకోర్టులో యాంకర్ పిటిషన్ వేశారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత విష్ణుప్రియ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు విష్ణుప్రియ విషయంలో ముందుకు వెళ్లాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే యూట్యూబర్ రీతూ చౌదరిని కూడా విచారణకు రావాల్సిందిగా పంజాగుట్ట పోలీసులు స్పష్టం చేయగా.. ఇప్పటి వరకు కూడా ఆమె విచారణకు రాలేదు. గతంలో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చినప్పుడు కూడా రీతూ చౌదరి మూడు గంటలకు హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని చెప్పినప్పటికీ రీతూ చౌదరి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలో ఆమెకు మరోసారి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాజధాని నిర్మాణంలో ఆలస్యం

**ఇంతవరకు రాజధానిలేని రాష్ట్రంగా ఏపీ**
**అమరావతిలో పర్యటించిన మంత్రి నారాయణ**

అమరావతి : రాష్ట్ర విభజన జరిగి సుమారు తొమ్మిదేళ్లు అవుతున్నా ఇంకా ఏపీకి రాజధాని లేదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాజధాని నిర్మాణం మరింత ఆలస్యమైందని మంత్రి నారాయణ అన్నారు. ఏపీ రాజధాని అమరావతిలో నారాయణ మంగళవారం పర్యటించారు. ఇప్పటికే పలు పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగ్లాలను, సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి అయినా రాజధాని అవసరమని, ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. గత టీడీపీ హయాంలో రూ. 43 వేల కోట్లకు టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా సర్వీస్ భవనాలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. కానీ గత ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. ఐఐటీ మద్రాస్‌ను పిలిచి బిల్డింగ్ నాణ్యత పరిశీలించి, కాంట్రాక్టర్లతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. 90 శాతం పనులు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. మొదట క్లీనింగ్‌తో పనులు మొదలు అయ్యాయన్నారు. ఇవాళ సెక్రెటరీ.. ప్రిన్సిపాల్ కార్యదర్శి బంగళాలు పరిశీలించామన్నారు. 186 బంగాళాలు మంత్రులు, జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయన్నారు. గెజిటెడ్ అధికారులకు 1440,ఎన్జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయని తెలిపారు. అలాగే హై కోర్ట్ 16.85 లక్షల చదరవు అడుగులు వస్తుందన్నారు. అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో ఉంటుందని, 15 రోజుల్లో కాంట్రాక్టర్ల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని నారాయణ తెలిపారు. ప్రజలపై ఒక్క పైసా భారం కూడా లేకుండా రాజధాని నిర్మాణం పూర్తి అవుతుందని, వరల్డ్ బాంక్.. ఎడిబి నుంచి రుణాలు తీసుకున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ వాల్యూ పెరిగిన తర్వాత. అప్పు తీర్చడం జరుగుతుందన్నారు. ప్రజల డబ్బు వృధా చేస్తున్నారని ప్రతిపక్షం చెబుతోందని.. ఇది సరికాదని మంత్రి అన్నారు. మరోవైపు విశాఖ జిల్లా, భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు.ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై నాలుగు రోజుల క్రితం విశాఖ స్థానిక నేతలతో చర్చించామన్నారు. వీఎంఆర్డీఏ పరిధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని తెలిపారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైలో ఉంచుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని.. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ ఘటనలో మరో మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం డెడ్‌బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

# అర్ధరాత్రి బిర్యానీసెంటర్ పేలుడు

**ఘటనపై విచారణ చేస్తున్న పోలీసులు**

నల్లగొండ : ఓ బిర్యానీ సెంటర్‌లో అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించడంతో చుట్టుపక్కలవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులోని పూజిత అపార్ట్మెంట్ ఎదురుగా ఉన్న హాట్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో చోటుచేసుకుంది. పేలుడు ధాటికి షెటర్ గేటుతోసహా లోపల ఉన్న సామాన్లు రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి. అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు. అయితే గ్యాస్ సిలిండర్ పేలిందా లేదా షార్ట్ సర్క్యూట్ అయ్యిందా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. రంజాన్ మాసం సందర్భంగా అర్ధరాత్రి వరకు షాప్ తెరిచే ఉన్నదని, షాప్ బంద్‌చేసిన 15 నిమిషాలకు ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ అయితే ఏమీ పేలలేదని, మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అని పోలీసులు ఆరాతీస్తున్నారు.



## నితిన్ సినిమాలో డేవిడ్‌వార్నర్

### వార్నర్‌కు తెలుగు క్లాసులు చెప్పిన శ్రీలీల

ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు తెలుగు క్లాసులు తీసుకున్నారు నటులు నితిన్, శ్రీలీల. వీరిద్దరు జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మువీ మేకర్స్ నిర్మిస్తుంది. వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ వార్నర్, తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకను ఇటీవల హైదారాబాద్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు క్రికెటర్ డేవిడ్ వార్నర్ ముఖ్య అతిథిగా వచ్చి సినిమా విజయవంతం కావాలని కోరుకోవడంతో పాటు తెలుగులో మాట్లాడి అందరిని అలరించారు. అయితే డేవిడ్ తెలుగులో మాట్లాడటానికి నితిన్, శ్రీలీల ఏ విధంగా సాయం చేశారో చూపిస్తూ.. ఒక ఫన్నీ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. తెలుగు నేర్చుకుంటున్న డేవిడ్ వీడియోను మీరు చూసేయండి.



## ఆ హీరోతో నటించడం ఎంతో అదృష్టం : మాళవిక

తమిళంలో అగ్ర హీరోల సరసన నటించి ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సందర్భంగా ప్రభాస్ మంచితనం, సహృదయతకు తాను ఫిదా అయిపోయానని, ముఖ్యంగా ఆయన ఇంటి నుంచి తీసుకొచ్చే ఫుడ్ అద్భుతమని గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్‌ను పొగడ్తల్లో ముంచెత్తింది భామ. తాజాగా మరోసారి ప్రభాస్ గురించి మాట్లాడింది. ప్రభాస్ వంటి గ్రేట్ పర్సన్‌తో నటించడం తన అదృష్టమని, తన కెరీర్‌లోనే మైలురాయిలా నిలిచే చిత్రమవుతుందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. 'నిజంగా ఈ సినిమా ఛాన్స్ రావడం లక్కీగా ఫీలవుతున్నా. షూటింగ్ అంతా సరదాగా సాగిపోతున్నది. ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి మించిన ఆనందం ఏముంటుంది? ఈ సినిమాను జీవితాంతం గుర్తుంచుకుంటా' అని ఆనందం వ్యక్తం చేసింది మాళవిక మోహనన్. హారర్ కామెడీ థ్రిల్లర్ రూపొందిన 'రాజాసాబ్' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.




## ప్రభాస్ కార్ కలెక్షన్ చూస్తే మతిపోవాల్సిందే.

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. ప్రస్తుతం రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో డార్లింగ్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్ ఆకట్టుకుంటున్నాయి. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ మూవీలో ప్రభాస్ సరికొత్త పాత్రలో కనిపిస్తుండడంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని తెగ వెయిట్ చేస్తున్నారు ఫ్యాన్స్. త్వరలోనే ఈ సినిమా అడియన్స్ ముందుకు రానుంది. అలాగే తన కొత్త ప్రాజెక్ట్‌పై ఫోకస్ పెట్టాడు డార్లింగ్. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ప్రభాస్ లైఫ్ స్టైల్, కార్ కలెక్షన్, రెమ్యునరేషన్ గురించి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. ప్రభాస్ ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.100 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్నాడు. నివేదికల ప్రకారం డార్లింగ్ ఆస్తి రూ.240 కోట్లకు పైగా ఉంటుందట. ఇక ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు దాదాపు రూ.2 కోట్లు తీసుకుంటాడని సమాచారం. అంతేకాకుండా ప్రభాస్ వద్ద కార్ కలెక్షన్ చూస్తే దిమ్మతిరిగిపోద్ది. ప్రస్తుతం డార్లింగ్ వద్ద రోల్స్ రాయిస్ ఫాంటమ్ కారు ఉంది. ఈ కారు విలువ రూ.8 కోట్లు. ఇండస్ట్రీలో అక్షయ్ కుమార్, షారుఖ్ ఖాన్, అమితాబ్ బచ్చన్ వద్ద మాత్రమే ఈ కారు ఉందట. అలాగే డార్లింగ్ దగ్గర రూ.2.08 కోట్ల విలువైన జాగ్వార్ కారు సైతం ఉంది. అలాగే రూ.1 కోటి విలువైన రేంజ్ రోవర్ స్పోర్ట్స్ కారుతోపాటు.. డార్లింగ్ గ్యారేజీలో లాంబోర్గినీ అవెంటడోర్ రోడ్ స్టర్ కారు ఉంది. దీని విలువ రూ.6 కోట్లు ఉంటుంది. అలాగే రూ.68 లక్షల విలువైన %డీవీజె ళ%3 ఉన్నాయి. ప్రస్తుతం రాజాసాబ్ సినిమాతోపాటు డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్షన్ లో ఒక సినిమా.. సలార్ 2 చిత్రాల్లో నటిస్తున్నాడు డార్లింగ్.

## పండండి మగబిడ్డకు జన్మనిచ్చిన అమీజాక్సన్

బాలీవుడ్ నటి అమీ జాక్సన్ మరోసారి తల్లైంది. పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని అమీ జాక్సన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. బాబుకు ఆస్కార్ అలెగ్జాండర్ వెస్ట్‌విక్ అని పేరు పెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు భర్త, బిడ్డతో దిగిన ఫొటోను పంచుకుంది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు, అభిమానులు అమీ జాక్సన్ జంటకు కంగ్రాట్స్ చెబుతూ పోస్టులు పెడుతన్నారు. కాగా, అమీ జాక్సన్ సినిమాల్లోకి వచ్చే ముందు మోడల్‌గా రాణించింది. 2010లో తమిళంలో 'మద్రాస్‌పట్టణం' మూవీతో చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో ప్రతీక్ బబ్బర్ సరసన 'ఏక్ దీవానా థా'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. 2014లో తెలుగులో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ నటించిన 'ఎవడు' చిత్రంలో నటించింది. ఆ తర్వాత 2018లో సూపర్‌స్టార్ రజనీకాంత్ రోబో 2. చిత్రంతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. అలాగే చియాన్ విక్రమ్ 'ఐ'మూవీలోనూ మెరిసింది. ప్రస్తుతం అమ్మడు తెలుగు సినిమాలకు దూరమైంది. గతేడాది ఆగస్టులో తన ప్రియుడు, హాలీవుడ్ నటుడు ఎడ్ విస్ట్‌విక్‌ను రెండో వివాహం చేసుకుంది. దక్షిణ ఇటలీలోని 16వ శతాబ్ధం నాటి కాస్టెల్లో రోకో కోటలో ఆమె ఎడ్ వెస్ట్‌విక్‌ను మనువాడింది. అమీజాక్సన్ గతంలో జార్జ్ పనయోట్టు అనే బిజినెస్‌మెన్‌తో ప్రయాణం నడిపి.. 2019లో ఎంగేజ్‌మెంట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత పెళ్లి కాకుండానే ఓ బిడ్డకు జన్మనించింది. వీరి ప్రేమ ఎక్కువ కాలం నిలువలేదు. చివరకు 2022లో పనయోట్టుతో తనబంధం ముగిసిందని ప్రకటించింది. అప్పటి నుంచి కుమారుడు ఆండ్రెస్‌తో ఒంటరిగానే ఉంటూ వచ్చింది. ఆ తర్వాత అమీ జాక్సన్ హాలీవుడ్ స్టార్ వెస్ట్‌విక్‌తో ప్రేమలో పడింది.





## మత్తు కళ్లలో

### మతిపోగొడుతున్న శ్రీయరెడ్డి

శ్రియ రెడ్డి.. టెలివిజన్ ప్రెజెంటర్, వీడియో జాకీ గా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ అమ్మడు ఎక్కువగా తమిళం, తెలుగు సినిమాల్లో నటించింది. అంతే కాదు మాజీ భారత టెస్ట్ క్రికెటర్ భరత్ రెడ్డి కుమార్తె ఆమె . శ్రియ తన నటనా జీవితాన్ని ప్రారంభించే వీడియో జాకీగా పనిచేసింది. ఈ బ్యూటీ 2002లో "సమురాయ్" అనే తమిళ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగు, మలయాళ చిత్రాల్లో సుమారు డజను సినిమాల్లో నటించింది. "బ్లాక్" , "తిమిరు", "కంచివరం", "సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్" లాంటి సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక తెలుగులో ఈ భామ మొదటి చిత్రం "అప్పుడప్పుడు". ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆతర్వాత "బ్లాక్" చిత్రంలో మమ్ముట్టితో కలిసి నటించడం ద్వారా మలయాళంలో మంచి గుర్తింపు పొందింది. శ్రియ 2008లో నటుడు మరియు నిర్మాత విక్రమ్ కృష్ణను వివాహం చేసుకుంది. విక్రమ్ కృష్ణ ప్రముఖ నిర్మాత రెడ్డి కుమారుడు. అలాగే నటుడు విశాల్ కృష్ణ సోదరుడు. వివాహం తర్వాత ఆమె తన భర్తతో కలిసి సినిమా నిర్మాణంలోకి కూడా అడుగుపెట్టింది. ఇటీవల "సలార్" చిత్రంలో రాధా రామ పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఆమె తదుపరి పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో కూడా కనిపించనుంది. తాజాగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు షేర్ చేసింది



## క్రేజీ ఫొటోలను షేర్ చేసిన షాలిని



షాలిని పాండే తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ బ్యూటీ 1993 సెప్టెంబర్ 23న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. జబల్‌పూర్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన షాలిని, చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న రెండవ సంవత్సరం నుండే ఆమె నాటకాల్లో నటించడం ప్రారంభించింది. షాలిని పాండే 2017లో విజయ్ దేవరకొండ నటించిన తెలుగు చిత్రం అర్జున్ రెడ్డి ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె ప్రీతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా భారీ విజయం సాధించడంతో షాలినికి విశేష గుర్తింపు లభించింది. తెలుగు మాట్లాడడం రానప్పటికీ, ఈ చిత్రంలో తన పాత్రకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంది. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని తెలుగులో మహానటి, 118, ఇద్దరి లోకం ఒకటే, నిశ్శబ్దం వంటి చిత్రాల్లో నటించింది. ఆమె తమిళ సినిమా 100% కాదల్ లో కూడా కనిపించింది. హిందీలో జయేష్‌భాయ్ జోర్దార్, మహారాజ్ చిత్రాలతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. మహారాజ్ చిత్రంలో ఆమె నటన, ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే షాలిని. రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com